
ఆంధ్రజ్యోతి ****

ANDHRAJYOTHY

నల్లగొండ

3 శుక్రవారం 10 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 , కనిష్ఠం 15.8



ముక్కోటి ఏకాదశి వేడుకలకు ముస్తాబైన జిల్లాకేంద్రంలోని రామాలయం

ముక్కోటికి ముస్తాబు

- నేడు ముక్కోటి ఏకాదశి
- ముస్తాబైన వైష్ణవాలయాలు
- స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వైష్ణవాలయాలన్నీ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారు శుద్ధ ఏకాదశి రోజున ఉత్తర ద్వార నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకుంటే పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. సూర్యుడు ఉత్తరాయణానికి చేరే ముందు వచ్చే ధనుర్మాస వైకుంఠ ఏకాదశికి ప్రత్యేకత ఉంది. అందువల్ల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు ఆరాటపడుతుంటారు. ఉత్తరద్వారం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ఉత్తర ద్వారాన్ని ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేకంగా ఏర్పాటు వేదికలో స్వామివారు ఆసీనులు కాగా భక్తులు దర్శించుకోనున్నారు. ఉదయం 5 గంటలకే భక్తులు బారులుతీరనున్నారు. ఆలయాలను వివిధ రకాల పుష్పాలు, వివిధ రంగులతో అలంకరించారు. భక్తులు, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకోనున్నారు. శ్రీమాన్ భాష్యం జగన్నాధాచార్యులతో తిరుప్పావై ప్రవచనం సాగనుంది. వికాస తరంగిణి భక్తులు సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేయనున్నారు. అదేవిధంగా వీటీకాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం, షేర్‌బంగ్లా సంతోషిమాత దేవాలయం వేడుకలకు ముస్తాబయ్యాయి. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అర్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో అన్న కూటోత్సవం హోమాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్య హాజరై స్వామివారి దర్శించుకొని పరవశించిపోయారు.

సాగునీటి రంగానికి
మొదటి ప్రాధాన్యం

- ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్



డిండిలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో సాగునీటి రంగానికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. గురువారం డిండి మండల కేంద్రంలో రూ.3.5కోట్లతో నిర్మించతలపెట్టిన సీసీ, బీటీరోడ్ల పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సాగు ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతలతోపాటు నియోజకవర్గంలో చేపడుతున్న లిఫ్టులను పూర్తి చేసి నిత్యం కరువుకు గురవుతున్న దేవరకొండ నియోజకవర్గానికి సాగు నీరు అందిస్తామన్నారు. డిండి ఎత్తిపోతలకు ఏదుల్ల నుంచి నీరు తీసుకునేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.1800కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ చైర్మన్ జమున మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అంబటి అంజనేయులు, మత్స్యశాఖ అధికారి చరిత, ఎంపీడీవో వెంకన్న, గుర్రం రాములు, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, సిరాజ్‌ఖాన్, యాదగిరిరావు, శ్రీనివాస్‌గౌడ్, బుషిపాక పాల్గొన్నారు.

చందంపేట: ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, డిండి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌లు అన్నారు. గురువారం చందంపేట మండలం వీరన్నగూడెంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్‌కు తమ సమస్యలపై వినతిపత్రమిస్తోన్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)



నిధుల్లేవ్

గ్రామపంచాయతీల్లో పాలన కుంటుపడింది. పాలకవర్గాల్లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలిచ్చే గ్రాంట్లు పెండింగ్‌లో పడిపోవడంతో అభివృద్ధి నిలిచిపోయింది. పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు పంచాయతీల్లో అత్యవసర పనులకు సొంత నిధులు వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు బిల్లులురాక అప్పులపాలై ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అప్పులు చేసి పనులు చేయించడంతోపాటు, మరోవైపు అదనపు పనులతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. దాదాపు 11 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడంతో భారమంతా తమపైనే పడిందని కార్యదర్శులు మదనపడుతున్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- కుంటుపడిన పంచాయతీల పాలన
- పాలకవర్గాల్లేక నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు
- ఏడాదిగా 15వ ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్
- 30 నెలలుగా విడుదల కాని రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల్లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, దానికి సరిసమానంగా ఇచ్చే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన ఈ నిధులు మంజూరవుతాయి. జిల్లాలో ప్రస్తుతం ఏడాది కాలానికి సంబంధించి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, 30నెలలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో, పంచాయతీల్లో పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ప్రధానంగా ఈనిధులతోనే ట్రాక్టర్లకు ఈఎంఐ చెల్లించడం, మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వడం, డీజిల్ ఖర్చులు, ఇంకా వీధిదీపాల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు, సీసీరోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీల నిర్మాణాలు, నిర్వహణ చేపట్టేవారు. ప్రస్తుతం ఈ నిధులన్నీ నిలిచిపోవడంతో పంచాయతీల్లో తప్పనిసరిగా చేయాల్సిన వీధిదీపాల ఏర్పాటు, డీజిల్ ఖర్చులు, నల్లాల ఏర్పాటు, మోటార్ల మరమ్మతుల వంటి వాటికి ఇంటిపన్నులపైనే కార్యదర్శులు ఆధారపడాల్సి వస్తోంది. పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల నుంచి కొంత ఒత్తిడితోనైనా ఒప్పించి ఇంటి పన్నులు వసూలు చేస్తూ ఈ పనులు చేయిస్తుండగా, మిగిలిన తప్పనిసరి పనులకు కార్యదర్శులు తమ సొంత నిధులు వెచ్చించి పనులు చేయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.615.86కోట్ల నిధుల పెండింగ్

ఉమ్మడి జిల్లాలో కేంద్ర 15వ ఆర్థిక సంఘంనుంచి నల్లగొండ జిల్లాకు ప్రతీ మూడు నెలలకు రూ.19.50కోట్లు వస్తే...

- మిగతా 5వ పేజీలో...

ఎంజీయూ సమగ్రాభివృద్ధికి
ప్రణాళికలు సిద్ధం

- రూ.260కోట్లతో అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ఒక విజన్‌తో మహాత్మాగాంధీ యూనివర్సిటీని సంపూర్ణంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 2007లో నల్లగొండలో ఏర్పాటైన యూనివర్సిటీ అంచెలుఅంచెలుగా అభివృద్ధి చెందుతుంది. అయితే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం కోసం రూ.260కోట్లతో యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వంతో పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి అనేక నిర్ణయాలు చేపట్టిన నేపథ్యంలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు.
(నల్లగొండ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: యూనివర్సిటీ అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తున్నారు?

ఉపకులపతి: నేను గతంలో ఇదే యూనివర్సిటీలో

- మిగతా 4వ పేజీలో...

చర్లగూడ రిజర్వాయర్
పనుల అడ్డగింత

- పునరావాసం కల్పించాలని డిమాండ్



4

పనులను అడ్డుకుంటున్న చర్లగూడెం నిర్వాసితులు

సనాతన ధర్మరక్షణకు
పాదయాత్ర

- పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు విద్యా శంకర భారతీ స్వామిజీ



5

అనుగ్రహ భాషణ చేస్తున్న విద్యాశంకర్ స్వామిజీ

బీబీనగర్-గుంటూరు డబ్లింగ్‌కు
ముందడుగు

- విశాఖ పర్యటనలో పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన



5

బీబీనగర్ రైల్వే స్టేషన్

'ధరణి'లో సమస్యలు లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు, మర్రిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ధరణిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత తహసీల్దార్లపై ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం జిల్లాలోని చండూరు, మర్రిగూడ మండలాల్లో పర్యటించారు. చండూరు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైళ్లు, ధరణి పోర్టల్‌ను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ధరణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. భూసమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో సందర్శన తర్వాతే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా భూసమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. మర్రిగూడ మండల కేంద్రంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేపట్టారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, ఎస్టీ హాస్టల్, కేజీబీవీ పాఠశాలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అధికారుల విధి నిర్వహణ, పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వైద్యం కోసం నిరుపేదలు వస్తారని, వారికి మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందించాలని సూచించారు. ఓ గర్భిణి ప్రభుత్వాస్పత్రిలో తన పేరు రిజిస్టర్ చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పుకోసం వెళ్లడంపై డాక్టర్లను మందలించారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉండగా ప్రైవేట్ ఆస్పత్రిని ఎందుకు ఆశ్రయించిందని ప్రశ్నించారు. మండలంలో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు దృష్టి సారించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవికి సూచించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులను వారి సమస్యలను అడిగి తెలుసుకోగా మందులు సక్రమంగా లేవని బయటకు రాస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థినులకు పాఠాలు బోధించిన కలెక్టర్



విటమిన్ లోపం ఎలా అధిగమించాలనే అంశంపై కలెక్టర్ ఇలాత్రిపాఠి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. కేజీబీవీని ఆమె పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలోని 8వ తరగతి గదికి వెళ్లిన ఆమె వారికి సైన్స్ పాఠ్యాంశంపై కొద్దిసేపు పాఠాలు బోధించారు. మోతాదుకు మించిన యాంటీబయాటిక్ హానికరమని, ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇష్టంతో చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. పాఠశాలలో గదులు సరిపోవడం లేదని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రిన్సిపాల్ జ్యోతితో మాట్లాడారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 280మంది విద్యార్థినులు ఉండగా, 13గదులు ఉన్నాయని, తొమ్మిది గదులు అవసరమవుతాయని ప్రిన్సిపాల్ చెప్పటంతో నిధుల మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేసి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో చండూరు ఆర్డీవో శ్రీదేవి, చండూరు తహసీల్దార్ దశరథ, మండల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన, ఆదివాసీల మధ్య విభేదాలకు
కేంద్ర ప్రభుత్వం యత్నం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- నాగార్జునసాగర్‌లో కొనసాగుతున్న గిరిజన, ఆదివాసీల శిక్షణ



5

నాగార్జున ఆదివాసీ శిక్షణ తరగతుల్లో సంప్రదాయ వస్తువులతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మెనూ అమలవుతోందా..?

కేజీబీవీ విద్యార్థినులతో డీఈవో

మునుగోడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మెనూ అమలవుతుందా..? అని జిల్లా విద్యా శాఖాధికారి భిక్షపతి అన్నారు. మునుగోడుమండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. వివిధ తరగతులకు వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యాబోధన, మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వంటశాలలను పరిశీలించి వంటలను రుచి చూశారు. నిర్దేశించిన ప్రకారం నిబంధనలను పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. మెనూ పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్లగూడ రిజర్వాయర్ పనులు అడ్డగింత



మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలం వద్ద నిర్మాణ పనులను అడ్డుకున్న భూనిర్వాసితులు

మర్రిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న చర్లగూడ రిజర్వాయర్ పనులను ముంపు నిర్వాసితులు అడ్డుకున్నారు. గురువారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లగూడ రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలం వద్ద ఈ సంఘటన జరిగింది. చర్లగూడ రిజర్వాయర్ నిర్మాణంతో వెంకెపల్లి తండా, చర్లగూడ, నర్సిరెడ్డిగూడెం, వెంకెపల్లి గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. ఈ నాలుగు గ్రామాల్లో రెండు వేల కుటుంబాలు ఉండగా 1800 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం అందజేశారు. మిగిలిన 200మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, నాలుగు గ్రామాల కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్వాసితులు తొమ్మిదేళ్లుగా నిరసన వ్యక్తంచేస్తూ పనులు అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన నిర్మాణ పనులు అడ్డగించగా, చండూరు ఆర్డీవో శ్రీదేవి స్పందించి గురువారం వస్తానని భూనిర్వాసితులకు హామీఇవ్వటంతో అప్పటికి ఆందోళన విరమించారు. గురువారం ఆర్డీవో రాకపోవడంతో చర్లగూడెం రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలం వద్ద నిర్మాణ పనులను అడ్డుకుని క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఈఈ రాములునాయక్, డీఈ ఖాసీం అక్కడికి చేరుకుని భూనిర్వాసితులతో మాట్లాడారు. కలెక్టర్ పర్యటనలో ఉన్నందున ఆర్డీవో రాలేకపోయారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాధితులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామన్నారు. చింతపల్లి మండలంలోని మదనాపురం వద్ద బాధిత నిర్వాసితులకు పునరావాసం కోసం స్థలం కేటాయించారని, ఆ స్థలాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆందోళన విరమించాలని అధికారులు నచ్చజెప్పడంతో భూ నిర్వాసితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు రాంకోటి, భాస్కర్, యాదయ్య, నిరంజన్, రమణమ్మ, లక్ష్మి, కొండయ్య, నర్సింహ పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని దాడి

కోదాడ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన నలుగురిపై సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ గ్రామానికి చెందిన వివాహిత పండ్ల వ్యాపారం చేస్తుంది. ఆమె భర్తకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో గుడిబండకు చెందిన గోపితో పరిచయం ఏర్పడి ఆటోలో గ్రామాలు తిరుగుతూ పండ్లు, కూరగాయలు విక్రయిస్తోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడడంతో ఇది గమనించిన ఆమె భర్త పద్ధతి మార్చుకోవాలని భార్యను హెచ్చరించాడు. దీంతో పాటుగా ఆమెపై ఒకటి, రెండుసార్లు దాడి చేశాడు. భర్తపై కోపం పెంచుకున్న భార్య, భర్తపై దాడి చేసి బెదిరించాలని గోపితో పాటు తొగర్రాయికి చెందిన వీరబాబు, జగ్గయ్యపేటకు చెందిన నాగరాజులతో ఒప్పందం చేసుకుంది. ఇందుకు వారికి రూ.50 వేలు ఇచ్చేలా మాట్లాడుకుంది. బుధవారం రాత్రి భర్తపై దాడి చేయగా, ఆయన కేకలు వేశాడు. దీంతో దాడి చేసిన వ్యక్తులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని వివాహితతో పాటు గోపి, వీరబాబు, నాగరాజులను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

కత్తితో ఇద్దరిపై దాడి

నకిరేకల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చేపల వ్యాపారం విషయంలో గురువారం సాయంత్రం నల్లగొండ జిల్లా నకిరేకల్ బైపాస్ సమీపంలో కత్తితో ఇద్దరిపై దాడి జరిగింది. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ పట్టణానికి చెందిన ప్రేమ్‌కుమార్, సూర్యాపేటకు చెందిన సంజయ్ భార్గవ్‌లు నకిరేకల్‌కు చెందిన నాగస్వామి వద్ద చేపలు కొనుగోలు చేస్తూ వ్యాపారం చేస్తున్నారు. ప్రేమ్‌కుమార్, నాగస్వామికి రూ.11వేలు బకాయి ఉన్నాడు. డబ్బుల విషయంలో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి నాగస్వామితో పాటు నకిరేకల్‌కు చెందిన క్రాంతి, వెంకన్న, ఉదయ్, అజయ్ కలిసి ప్రేమ్‌కుమార్, సంజయ్ భార్గవ్‌లను కత్తితో పొడిచారు. తీవ్రగాయాలైన వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంక్రాంతి పండుగ ప్రత్యేకతల్లో పతంగులు ఒకటి. గంగిరెద్దు విన్యాసాలు, ముగ్గులు, రంగవల్లులతో పాటు పతంగులకు పండుగ నేపథ్యంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. ముగ్గులు నేలను, పతంగులు ఆకాశాన్ని వర్ణమయం చేయడం చూడముచ్చటగా ఉంటుంది. పతంగుల ఎగురవేతలో చిన్నా, పెద్దా పాలుపంచుకుంటారు. అయితే చైనా మాంజాల రంగప్రవేశంతో ప్రజలు, వన్యప్రాణుల భద్రత, ప్రమాదాల నివారణ లక్ష్యంగా వివిధ ప్రభుత్వ శాఖలు పతంగుల ఎగురవేతపై ఆంక్షలను విధిస్తున్నాయి. ఉత్సాహంగా జరుపుకోవాల్సిన పతంగుల పండుగను కాస్తా ఆంక్షల నడుమ జరుపుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే చైనా మాంజాల వినియోగంపై 2017లోనే హరిత ట్రైబ్యునల్ నిషేధం విధించినప్పటికీ చాటుమాటుగా విక్రయాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)





మాంజా గ్రత్త

- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదమే
- పతంగుల ఎగురవేతలో అప్రమత్తత అత్యవసరం
- చైనా మాంజాల వినియోగం, పతంగుల ఎగురవేతపై పలు ప్రభుత్వశాఖల ఆంక్షలు

ప్రతీ సంవత్సరంలో మూడు రోజుల పాటు పండుగను జరుపుకుంటాము. భోగి, మకర సంక్రాంతి, కనుమను ఉత్సాహంగా జరుపుకుంటారు. సాంప్రదాయాలకు తోడు పతంగులు ఎగురవేత పండుగ జోష్‌ను మరింత పెంచుతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు డాబాలపైన, బహిరంగ ప్రదేశాల్లో పతంగులను ఎగురవేస్తుంటారు. అయితే పతంగులను ఎగురవేసేందుకు కేవలం కాటన్ దారాలను మాత్రమే వినియోగించాలని అటవీశాఖ సూచిస్తోంది. చైనా మాంజాల వినియోగంతో పక్షులు గాయాలపాలు అవుతున్నాయని, అరుదైన మొక్కలు కోతకు గురవుతున్నాయని అటవీ శాఖ పేర్కొంది. కేంద్ర పర్యావరణ చట్టం(జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్-2016) ప్రకారం చైనా మాంజాలను విక్రయించినా, నిల్వ చేసినా సరఫరా చేసినా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని అటవీ దళాల ప్రధాన సంరక్షణ అధికారి డోబ్రియాల్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చైనా మాంజాల వాడకంతో మనుషులకు, పక్షులకు హాని జరిగితే





మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. పండుగ సీజన్‌లో నిఘా కోసం 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చైనా మాంజాల విక్రయాలు, వినియోగంపై అటవీ శాఖ టోల్ ఫ్రీ నెంబర్లు 040-23231440, 1800425364కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైల్వే ప్రాంగణాల్లో పతంగులను ఎగురవేయవద్దు

రైల్వే ప్రాంగణాల్లో పతంగులను ఎగురవేయవద్దని దక్షిణ మధ్య రైల్వే విభాగం కోరింది. రైల్వేస్టేషన్లు, రైలుపట్టాల సమీపంలో ఎగురవేస్తున్న పతంగుల దారాలు విద్యుత్ తీగలకు తాకుతూ విద్యుదాఘాతాలు ఏర్పడుతున్నాయని, గత సీజన్‌లో పలువురు ప్రమాదాలకు గురై మృతి చెందారని రైల్వేశాఖ పేర్కొంది. 25 కేవీ ట్రాక్షన్ ఓవర్ హెడ్ కండక్టర్‌లో పతంగులు, దారాలు చిక్కుకొని విద్యుదాఘాతాలకు కారణమవుతున్నాయని రైల్వే అధికారులు అంటున్నారు. ఓవర్ హెడ్ కండక్టర్ల నుంచి దారాలు, పతంగులు వేలాడితే వెంటనే రైల్వే శాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ లేన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా...

విద్యుత్ తీగలు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద పతంగులను ఎగురవేయడం ప్రమాదకరమని ట్రాన్స్‌కో సంస్థ హెచ్చరిస్తోంది. విద్యుత్ లేన్లపై ఇతర విద్యుత్ పరికరాలపై పతంగులు, దారాలు, పడినా పెను ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. చైనా మాంజాల బదులు, కాటన్, నైలాన్, లినిన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడాలని సూచిస్తున్నారు. మెటాలిక్ మాంజాలు విద్యుదాఘాతానికి దోహపడతాయని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ లేన్లు, స్తంభాల నుంచి వేలాడుతున్న మాంజాలను లాగవద్దని, తట్టుకున్న పతంగులను తీసే ప్రయత్నాలు చేయవద్దని ట్రాన్స్‌కో అధికారులు స్పష్టం చేస్తున్నారు. పండుగ పూట పతంగులు, మాంజాలతో ఎదురయ్యే సమస్యలపై విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు లేదా సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని, వెబ్‌సైట్ www.tssouthernpower.com ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చునని అధికారులు సూచిస్తున్నారు.

చైనా మాంజాలతో హాని

విషపూరిత రసాయనాలతో తయారుచేస్తున్న చైనా మాంజాలు ఆరోగ్యానికి చేటు తెస్తాయని వైద్య శాఖ హెచ్చరిస్తోంది. పదును కోసం దారాలకు నిషేధిత రసాయనాలను పూసి విక్రయిస్తున్న చైనా తరహా మాంజాలను వినియోగించవద్దని సూచిస్తోంది. పతంగులను ఎగురవేసే క్రమంలో చేతులకు కాట్లు పడి మాంజలలోని విషపదార్థాలు శరీరంలోకి చేరే ప్రమాదం ఉన్నందున సహజ సిద్ధమైన రంగులతో చేసిన స్థానిక మాంజాలను మాత్రమే వాడాలని, పతంగులను ఎగురవేసే సమయంలో తప్పనిసరిగా కళ్లజోడు, క్యాప్ ధరించాలని అవసరమైన వారు సన్‌స్క్రీన్ లోషన్‌ను పూసుకోవాలని కూడా వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. అలాగే రేలింగ్ లేని భవనాలపై నుంచి పతంగులను ఎగురవేయరాదని, ఎగిరిపోతున్న గాలిపటాలను పట్టుకునేందుకు రహదారులపై అజాగ్రత్తగా పరుగెత్తరాదని పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. రక్షణగోడలు లేని బావులు, కుంటలు, సంపుల వద్ద పతంగులు ఎగురవేయకుంటే మంచిదని కూడా అధికారులు సూచిస్తున్నారు.

ఎంజీయూ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ఉపకులపతిగా సేవలందించిన అనుభవం ఉంది. ఆ తర్వాత అభివృద్ధిని, ప్రస్తుత స్థితిగతులను బాధ్యతలు స్వీకరించిన ఈ రెండున్నర నెలల కాలంలో అధ్యయనం చేశా. వాటి ప్రాతిపాదికన నూతన ప్రణాళికలను సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి: యూనివర్సిటీలో అభివృద్ధి పనులకు ఏమేం ప్రతిపాదనలు రూపొందించారు?

ఉపకులపతి: యూనివర్సిటీలో భవన నిర్మాణాలకోసం రూ.260 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ సహకారంతో ఈ నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నాం. యూనివర్సిటీలో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులన్నింటినీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోర్సులుగా మార్చడానికి ప్రతిపాదనలు పంపాం. రాబోయే విద్యా సంవత్సరం నాటికి కొత్త కోర్సులు, గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీ, లా డెవలప్‌మెంట్ అండ్ స్టడీస్ కోర్సులను ప్రవేశపెడతాం.

ఆంధ్రజ్యోతి: విశ్వ విద్యాలయంలో నైపుణ్యాల పెంపునకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఉపకులపతి: ప్రతీ విభాగంలో నైపుణ్యాల పెంపునకు సాయంత్రం 5గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు కోర్సులు నిర్వహిస్తాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకొని నైపుణ్యాభివృద్ధికి రూ.30కోట్లతో బిల్డింగ్ నిర్మించి, అందులో స్వల్ప వ్యవధి కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇచ్చి వారిని తీర్చిదిద్దుతాం.

ఆంధ్రజ్యోతి: క్రీడల్లో విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు? నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఏమిటి?

ఉపకులపతి: స్పోర్ట్స్ ఫీల్డ్ అభివృద్ధికి, ఇండోర్ స్టేడియం ఆధునికీకరణకు ప్రతిపాదనలు రూపొందించాం. ఇండోర్ గేమ్స్‌కు సంబంధించి ఫ్లోరింగ్ కుషన్‌ను ఏర్పాటుచేయనున్నాం. ప్లేగ్రౌండ్ కోసం రూ.కోటి కేటాయిస్తాం. అదేవిధంగా ఎంపీ థియేటర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి మహిళా సంఘాల ద్వారా నూతన క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం. విశ్వ విద్యాలయంలో మొక్కలు, చెట్ల సంరక్షణకు ఒక హార్టికల్చర్ నిపుణుడిని నియమించాం.

ఆంధ్రజ్యోతి: యూనివర్సిటీ పనివేళలు ఏ విధంగా ఉన్నాయి? హాజరు శాతంపై ఎలాంటి నిర్ణయాలు చేశారు?

ఉపకులపతి: విద్యా ప్రణాళికలను, యూనివర్సిటీ పనివేళలను పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నాం. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తాం. 75శాతం హాజరును తప్పనిసరి చేయడంతో పాటు డిటెన్షన్ విధానాన్ని సైతం ప్రవేశపెట్టాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థుల అభ్యున్నతికి తీసుకున్న చర్యలు ఎలా ఉన్నాయి?

ఉపకులపతి: యూనివర్సిటీలో మెంటరింగ్ విధానం ద్వారా ప్రతీ విద్యార్థి సమగ్ర సమాచారంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్నాం. నూతనంగా ల్యాబ్ పరికరాలను, తరగతిగదుల డిజిటలైజేషన్ ద్వారా 24గంటల సేవలందిస్తున్నాం. ప్రతీ టీచర్ విద్యార్థులను పర్యవేక్షిస్తూ వారికి అవసరమైతే ఒత్తిడికి గురికాకుండా కౌన్సిలింగ్ సైతం ఇస్తున్నాం. ప్రతీ విద్యార్థిని క్రమశిక్షణగా తయారు చేస్తాం. దీంతో మంచి ఫలితాలు సాధించడంకోసం కృషి చేస్తున్నాం. విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను పెంచి ఉన్నతస్థాయికి అధిగమించేలా ప్రయత్నం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: యూనివర్సిటీలో ఫ్యాకల్టీ సరిపడా ఉన్నారా?

ఉపకులపతి: యూనివర్సిటీలో రెగ్యులర్ టీచర్ 70మంది ఉన్నారు. వాస్తవానికయితే 125మంది రెగ్యులర్ టీచర్లు అవసరం ఉంటుంది, 46మంది కాంట్రాక్ట్ టీచర్లున్నారు. ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశాం. త్వరలో భర్తీ చేస్తాం. ఏ విభాగంలో కూడా టీచర్ల కొరత లేకుండా సాఫీగా విద్యాబోధన జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ఇటీవల కృష్ణవేణి వసతి గృహంలో గొడ్డు కారం. అన్నంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఉపకులపతి: ఎంజీయూలో వసతిగృహాల మెస్ నిర్వహణ పూర్తిగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నాం.ప్రతినెలా ఒక విభాగం నుంచి సెక్రటరీని ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నుకుంటారు. విశ్వవిద్యాలయంలో కొందరు విద్యార్థులు విపరీత చర్యల ద్వారా దురదృష్టకరమైన చర్యలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని ఫేస్ రికగ్నిజేషన్ హాజరును ప్రవేశపెట్టడానికి నిర్ణయించాం. అన్నంలో కారం వడ్డించామనేది వాస్తవం కాదు. కావాలని కొందరు యూనివర్సిటీని బదనం చేయడం కోసమే సృష్టించారు.

అవమానభారంతో వివాహిత ఆత్మహత్య



రాపోలు రమ్య(ఫైల్)

రామన్నపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసిందని నింద మోపడంతో అవమానం భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ మల్లయయ్య తెలిపిన వివరాల ప్రకారం చేనేత కుటుంబానికి చెందిన రాపోలు నరేష్, రమ్య(31) దంపతులకు ఇద్దరుసంతానం. ఈ నెల 5 రమ్య హయత్‌నగర్ మండలం మునగనూరులోని మేలిడి మానస కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హాజరైంది. అదే వేడుకలకు జంగిలి మురళీ కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు. ఆ రోజు రాత్రి అక్కడే ఉన్నారు. మరుసటిరోజు ఉదయం రమ్య సిరిపురం గ్రామానికి చేరుకుంది. సాయంకాలం రాపోలు నరేష్‌కు మానస ఫోన్ చేసి జంగిలి మురళీకి చెందిన బంగారంపోయింది. మీకేమైనా దొరికిందా అని అడిగింది. కొద్దిసేపటి తర్వాత మురళీ ఫోన్ చేసి రమ్యనే బంగారం దొంగతనం చేసిందని వాదించి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. దీంతో హయత్‌నగర్ పోలీసులు రమ్మనడంతో భార్యాభర్తలు ఇద్దరూ వెళ్లి కలిశారు. ఎస్ఐ సమక్షంలోనే మురళీ గట్టిగా దబాయించి మాట్లాడి రౌడీలతో కొట్టిస్తానని బెదిరించాడు. దీంతో అవమాన భారంతో రమ్య మానసిక ఆందోళనకు గురైంది. గురువారం రమ్మని పోలీసులు చెప్పడంతో అవమానం భరించలేక తెల్లవారుజామున తన ఇంట్లోని రసాయనాన్ని తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. భర్తకు విషయం తెలుపగా రామన్నపేట ఆసుపత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ మృతి చెందింది. నరేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. తన భార్య మృతికి కారణమైన జంగిలి మురళీపై, బెదిరింపులకు పాల్పడుతున్నా పట్టించుకోని హయత్‌నగర్ ఎస్ఐ సైదులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నరేష్ కోరారు.

బంధువుల రాస్తారోకో

అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్న రాపోలు రమ్య కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు గురువారం చిట్యాల- భువనగిరి రహదారిపై రాస్తారోకో చేశారు. ఆత్మహత్యకు కారకులైన ఎస్ఐ, మురళీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో చర్యలు తీసుకుంటామని రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

భూతగాదాలతో హత్య

చివ్వెంల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భూతగాదాల నేపథ్యంలో కుట్ర పన్ని ఒకరిని హత్య చేశారని సూర్యాపేట డీఎస్పీ పీ రవి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి లక్ష్మీనాయక్ తండాలో జరిగిన హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వివరాలను వెల్లడించారు. లక్ష్మీనాయక్‌తండాకు చెందిన ధరావత్ శేషు, అతడి బాబాయ్ ధరావత్ వెంకన్నకు మధ్య 2017 నుంచి భూతగాదాలు జరిగి ఇరువురిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇదే విషయంపై తరచూ పంచాయితీ కావడంతో వెంకన్న కుమారుడు ధరావత్ దీపక్, శేషులను అడ్డు తొలగించడానికి గత కొద్దిరోజులుగా ప్రయత్నిస్తూ డిసెంబరు 31వ అర్ధరాత్రి లక్ష్మీనాయక్‌తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వ వద్ద తన మిత్రుడు ధరావత్ రాజేష్, సురేష్ మద్యం సేవిస్తుండగా సూర్యాపేట నుంచి తన గ్రామానికి వెళ్తున్న శేషు వారిని చూసి ఆగడంతో దీపక్, శేషుల మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. అదే అదునుగా భావించిన దీపక్ తన బైక్‌లో ఉన్న కత్తితో శేషుపై దాడి చేశాడని, పక్కనే ఉన్న దీపక్ మిత్రులు శేషును పట్టుకోగా వారిని వదిలించుకొని ప్రాణభయంతో పరిగెత్తిన శేషు తండాలోని వాంకుడోతు రంగా ఇంటి వెనుక ఉన్న గుడిసెలో దాచుకున్నాడన్నారు. దీపక్, అతడి తండ్రి వెంకన్న, తల్లి సుజాత, వెంబడించి శేషును గొంతు కోసి హతమార్చినట్లు తెలిపారు. ఈ కేసులో ఆరుగురు నిందితులతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్‌ను అభినందించారు.

సిమెంట్ అక్రమ తరలింపు ముఠా అరెస్టు

నల్లగొండరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా లూజ్ సిమెంట్ రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కే శివరాంరెడ్డి తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లారీ బంకర్లలో లూజ్ సిమెంట్‌ను అక్రమంగా డ్రైవర్ల నుంచి కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా వివిధ కంపెనీల పేర్లతో విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేశామన్నారు. సుమారు రూ.4 లక్షల విలువైన గల 1,500 సిమెంట్ బస్తాలు, ఒక బంకర్(లారీ) స్వాధీనం చేసుకున్నామన్నారు. సిమెంట్ పరిశ్రమల్లో లూజ్ సిమెంట్‌ను నింపే చోట 35 టన్నులకు బదులుగా అక్కడి వారితో కుమ్మక్కై డ్రైవర్లు 37 టన్నులు నింపుతున్నారని తెలిపారు. అదనంగా నింపిన లూజ్ సిమెంట్‌ను ఇక్కడికి వచ్చాక విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వ్యక్తులు వివిధ కంపెనీల పేర్లతో ఆ సిమెంట్‌ను విక్రయిస్తున్నారని వివరించారు. ఈ నేరాలకు సంబంధించి చిట్యాలకు చెందిన గుండాల నవీన్, గుండాల దుర్గయ్య, గుండాల శ్రీను కేసులపై కేసు నమోదు చేశామన్నారు. అదేగ్రామానికి చెందిన రమణయ్య పరారీలో ఉన్నాడన్నారు. వీరితో పాటు వివిధ సిమెంట్ పరిశ్రమలకు చెందిన 30 మంది లారీడ్రైవర్లపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ ధర్మ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు శివప్రసాద్, మహేందర్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూరు(ఎస్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. నెమ్మికల్ గ్రామానికి చెందిన మడ్డి రాములు గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదశాత్తు జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాములు కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, సొసైటీ అధ్యక్షుడు శెనగాని మల్లయ్య డిమాండ్ చేశారు.

మురుగుకాల్వలో పడి వ్యక్తి మృతి

చిట్యాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ పరిధిలో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు మురుగుకాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ధర్మా తెలిపిన ప్రకారం చిట్యాల పట్టణ పరిధిలోని ముత్యాలమ్మగూడెం ప్రాంతానికి చెందిన జావీద్ మహ్మద్(40) మద్యానికి బానిసై భార్యాపిల్లలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చి హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పివెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకూ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. గురువారం స్థానిక 10వ వార్డులో ఎల్లమ్మ గుడినిర్మాణం పనులు చూడడానికి వెళ్లిన స్థానిక ఓ వ్యక్తి మురుగుకాల్వలో మృతదేహం ఉండడం చూసి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. అతిగా మద్యం తాగి ప్రమాదవశాత్తు మురుగుకాల్వలో పడి మృతి చెందాడని, అతడి భార్య షాహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహ్మద్‌కు భార్యతో పాటు కుమార్తె ఉంది.

వ్యర్థపదార్థాల ఏరివేత ముసుగులో చోరీ

భువనగిరి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థ పదార్థాల సేకరణ ముసుగులో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భువనగిరి పట్టణ ప్రధానరహదారి వెంట నివసిస్తున్న టీ జగదీష్ సమీపంలోనే మరో ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు నిర్మాణ పనులను పరిశీలించేందుకు ఈ నెల 7న వెళ్లి రాత్రి తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగలు ఉన్నట్లు గ్రహించి వెంటనే దర్వాజాలను మూసి దొంగ. దొంగ అంటూ అరిచారు. వెంటనే లోపలి నుంచి ఒకరు, బయట కాపలాగా ఉన్న మరొకరు కుటుంబసభ్యులను నెట్టివేసి రహదారిపైకి పరుగులు తీశారు. దీంతో పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ తప్పించుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో తనిఖీలు చేయగా రూ.3లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.10,500 నగలు చోరీకి గురైనట్లు తేలింది. ఈ మేరకు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్

బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం మధ్యాహ్నం భువనగిరి బస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో తచ్చాడుతున్న ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొమురగిరి యాకూబ్, యాదగిరిగుట్టకు చెందిన అలకుంట్ల మనుస్వామిని అదుపులోకి తీసుకొని విచారించగా రహదారుల వెంట ప్లాస్టిక్, ఇనుము తదితర వ్యర్థాలను ఏరుకుంటూ తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆలయాలు లక్ష్యంగా దొంగతనాలు చేస్తున్నట్లు, జగదీష్ ఇంటిలో కూడా దొంగతనం చేసింది తామిద్దరమేనని ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే మునిస్వామిపై యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో 8 దొంగతనాల కేసులు, యాకూబ్‌పై సూర్యాపేట పోలీస్‌స్టేషన్‌లో రెండు చోరీ కేసులు గతంలోనే నమోదైనట్లు తేలింది. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి రూ.3.10లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ జరిగిన 36గంటల వ్యవధిలో దొంగలను పట్టుకున్న పోలీసులను డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీ రాహుల్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుట్ట పట్టణంలోని బార్‌లో చోరీ

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని యాదాద్రిబార్‌లోని బుధవారం రాత్రి చోరీ జరిగింది. బార్‌లో సమారు రూ.10వేల విలువైన లిక్కర్, రూ.11వేల నగదు అపహరించినట్లు బార్ నిర్వాహకుడు పల్లె నర్సింహ తెలిపారు.ఈ విషయంపై గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

మునుగోడులో దొంగల హల్‌చల్

మునుగోడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. ఆయా ఇళ్లలో బంగారు నగలు, నగదుతో పాటు బైక్‌ను అహరించారు. ఈ ఘటనపై పోలీసులు, బాధిత కుటుంబాలు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలకేంద్రంలోని జిట్టగోని వెంకటయ్య, లింగస్వామిలకు చెందిన నాగార్జున స్వీట్ షాపు మూసివేసి భవనంపైన ఉన్న ఇంటికి వెళ్లారు. ఆ దుకాణంలోకి ప్రవేశించిన దొంగలు రూ.65వేల నగదు, స్వీట్లను సైతం అపహరించారు. ఆ పక్కనే ఉన్న వారి ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడి సుమారు 12 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. అనంతరం ఆ పక్కనే ఉన్న వెనిగల పురుషోత్తం ఇంట్లో చొరబడి రూ.60వేలు నగదుతో పాటు సుమారు అరకిలో వెండి సైతం అపహరించారు. అదే వరుసలో ఉన్న అద్దె భవనంలో కొనసాగుతున్న అటవీ శాఖ కార్యాలయంలోకి చొరబడి వస్తువులు చిందర వందర చేసి వెళ్లారు. అనంతరం పెద్దవాగు సమీపాన ఉన్న రాసమళ్ల శ్రీరాములు ఇంటి ముందు ఉంచిన బైక్‌ను ఎత్తుకెళ్లారు.

కేకలు వేయడంతో పొలం గట్ల వెంబడి..

మునుగోడు నుంచి నార్కట్‌పల్లి వైపున గల వడ్డెరగూడెంలో ఆర్అండ్‌బీ రహదారి వెంట ఉన్న ముద్దంగుల నర్సింహ ఇంట్లో తాళం విరగ్గొట్టి చొరబడ్డారు. ఆ సమయంలో కుక్కలు అరిచాయి. దీంతో కాలనీకి చెందిన ఒకరు నిద్రలేచి బయటకు వచ్చాడు. ఇద్దరు దుండగులు రాళ్లు పట్టుకొని కుక్కలను బెదిరిస్తుండటం చూసి భయపడి ఇంట్లోకి వెళ్లాడు. ఆ తర్వాత పక్క ఇంటివారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అందరూ వెంటనే నిద్రలేచి ఇంటి బయటకు ఒక్కసారిగా వచ్చి కేకలు వేసే క్రమంలో పొలం గట్ల వెంట దొంగలు పారిపోయారు. కాగా చోరీకి పాల్పడే సమయాల్లో దొంగలు సీసీ కెమెరాలను కర్రలతో పైకి ఎత్తి వెళ్లారు. ఇది చూస్తే పక్కా ప్రణాళికతో దొంగతనాలు చేసినట్లు తెలుస్తోంది. ఉదయం లేచాక దొంగతనం జరిగిందని గుర్తించిన బాధితులు ఒక్కొక్కరు లబోదిబోమంటున్నారు. సుమారు రూ.10 లక్షల బంగారు నగలు, రూ.125 లక్షల నగదు, బైక్ చోరీకి గురైంది.



దొంగతనం జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పోలీసు అధికారుల పరిశీలన

చోరీల విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇరుగు రవి పోలీసులతో చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి చోరీ జరిగిన ఇళ్లను సందర్శించారు. బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. దుండగుల కోసం పోలీసులు వేర్వేరు బృందాలుగా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ విభాగాల పోలీసులు వచ్చి చోరీలు జరిగిన ఇళ్లు, పరిసర ప్రదేశాలను పరిశీలించాయి. ఆయా చోట్ల వేలి ముద్రలను సేకరించారు. అంతకుముందు చండూరు సీఐ వెంకటయ్య వివరాలు సేకరించారు.

ని(వి)ధుల్లేవ్



గ్రామపంచాయతీలో పనులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

(3వ పేజీ తరువాయి)

యాదాద్రి జిల్లాకు రూ.11.24కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.13.25కోట్ల నిధులు వచ్చేవి. గడచిన రెండు నెలల క్రితం కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రెండు త్రైమాసికాలకు సంబంధించినవి విడుదల చేసినా, అవి పాలకవర్గాలున్నప్పుడు పెండింగ్ నిధులేనని ప్రస్తుతం 12 నెలలకు సంబంధించిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉంటే, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి 30నెలల నిధులు రావాల్సి ఉంది. మొత్తంగా మూడు జిల్లాలకు సంబంధించి రూ.615.86కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నల్లగొండ జిల్లాకు సంబంధించి రూ.273 కోట్లు, యాదాద్రి జిల్లాకు సంబంధించి రూ.157.36 కోట్లు, సూర్యాపేట జిల్లాకు సంబంధించి రూ.185.50 కోట్ల నిధులు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి రావాల్సి ఉన్నాయి.

ఏడాదిగా నిధులు నిల్

గ్రామపంచాయతీల్లో నిధుల్లేకపోవడంతో మల్టీపర్పస్ వర్కర్లకు సైతం సకాలంలో వేతనాలందని దుస్థితి నెలకొంది. వేతనాలకోసం వర్కర్లు సీఐటీయూ, ఏఐటీయూసీ నేతృత్వంలో వరుస ఆందోళనలు చేయడం, కార్మికులు పనులు ఆపేస్తామని హెచ్చరించడంతో సెప్టెంబరు వరకు మాత్రమే వేతనాలందించారు. ఆ తర్వాత మళ్లీ అక్టోబరు నుంచి ఇప్పటివరకు దాదాపు నాలుగునెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు పంచాయతీలలో ట్రాక్టర్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. దాదాపు 12 నెలలనుంచి ఈఎంఐలు పెండింగ్‌లో పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో వందకు పైగా పంచాయతీల్లో ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించకపోవడంతో వాటి ఫైనాన్స్ చేసిన బ్యాంకుల నుంచి జప్తు నోటీసులు, లీగల్ నోటీసులు వస్తున్నాయని కార్యదర్శులు వాపోతున్నారు.

ఆర్థిక భారం పడుతోందంటున్న కార్యదర్శులు

సర్పంచ్‌లు పదవీవిరమణ చేసిన ఫిబ్రవరి 2నుంచి ఇప్పటివరకు ప్రత్యేకాధికారులున్నప్పటికీ నిర్వహణ భారమంతా తమపైనే పడిందని కార్యదర్శులు చెబుతున్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు, మోటార్ల మరమ్మతుల వంటి తప్పనిసరి పనులకు తాము సొంత నిధులు వెచ్చించి చేయిస్తున్నామని, గ్రాంట్లు రాకపోవడంతో ఈ బిల్లులు రావడం లేదని చెబుతున్నారు. చిన్నపంచాయతీల్లో ఒక్కో కార్యదర్శి సుమారు రూ.3లక్షల వరకు, పెద్ద పంచాయతీల్లో దాదాపు రూ.7లక్షల నుంచి రూ.8లక్షల వరకు కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చేయించారని, ఈ బిల్లులు రాకపోవడంతో వడ్డీలు సొంత డబ్బులతో చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీల్లో కనీస పనులు పెండింగ్ ఉండకుండా చూడాలనే అధికారుల సూచనలతో పనులు చేయిస్తున్నామని, ఆర్థిక భారం మోయలేకపోతున్నామని వాపోతున్నారు.

అదనపు పనులతో అవస్థపడుతున్నామంటున్న కార్యదర్శులు

ఓ వైపు పంచాయతీ కార్యదర్శులుగా అన్నిరకాల బాధ్యతలు తామే నిర్వహిస్తుంటే, మరోవైపున ప్రభుత్వం ఇస్తోన్న అదనపు పనులతో పనిఒత్తిడి పెరిగిందని కార్యదర్శులు వాపోతున్నారు. కులగణన, ఫీవర్‌సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే వంటి ఏదో ఒక టాస్క్ ఎప్పుడూ కార్యదర్శులకు అదనంగా ఉంటుందని, ఏ పనిచేయకపోయినా అధికారుల నుంచి మెమోలు, తాఖీదులు వస్తున్నాయని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులుగా తప్పనిసరి పనులతోనే సతమతమవుతుండడం, పైగా ఆర్థికభారం పడి ఇబ్బందులు పడుతుంటే అదే సమయంలో అదనపు పనులు అప్పగిస్తే చేయలేని పరిస్థితి నెలకొందంటున్నారు. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్‌ను కలిసి ఇదేవిషయమై వినతిపత్రం కూడా అందజేశామని, అదనపు పనులు అప్పగించకుండా చూడాలని, పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడాలని విన్నవించారు. ప్రధానంగా మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలు నెలనెలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా చూడాలని పేర్కొన్నారు.

ఆర్థికభారం పడుతోంది



గ్రామపంచాయతీ పాలక వర్గాల్లేకపోవడంతో కార్యదర్శులపై భారం పడింది. ప్రధానంగా అత్యవసర పనులను సొంత నిధులతో చేయించాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా మాపై భారం పడుతోంది. బిల్లులు వెంటనే మంజూరుకాకపోవడంతో వడ్డీలు కట్టాల్సి వస్తోంది. దీనికితోడు కార్యదర్శులకు పనిభారం పెరిగింది. గ్రామ పంచాయతీ పనులకే కాకుండా ఇటీవల నిర్వహించిన కులగణన, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ఫీవర్ సర్వే కూడా నిర్వహించాల్సి వచ్చింది. ఆదివారాలు కూడా పనిచేయాల్సిరావడంతో ఒత్తిడికి లోనవుతున్నాం. పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం, పనిభారం లేకుండా జాబ్‌చార్ట్ ప్రకారమే పనులు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● నిరంజన్, రాష్ట్ర కోశాధికారి, పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్.

ఖుదాభక్షుపల్లి గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

● ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు

● ఉత్తర్వులు జారీ చేసిన నల్లగొండ జిల్లా కలెక్టర్

మర్రిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం, గైర్హాజరు నేపథ్యంలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదాభక్షుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నక్క పార్వతి ఖుదాభక్షపల్లి గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శి (కాంట్రాక్ట్ బేసిక్)గా విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బతికి ఉన్నవారు మృతిచెందినట్లు, మృతిచెందినవారు బతికే ఉన్నట్లు పలువురికి ధ్రువీకరణ పత్రాలు జారీచేశారని గత ఏడాది నవంబరు 10న గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ధ్రువీకరణ పత్రాలను ఇష్టానుసారంగా ఇవ్వడమే కాకుండా విధులకు గైర్హాజర్ కావటంతో ఎంపీడీవో మున్నయ్య, ఎంపీవో రవికుమార్ గతేడాది నవంబరు 15న గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలకు పాల్పడ్డారని, సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని విచారణలో తేలడంతో ఈ మేరకు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి జూనియర్ కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

డబ్లింగ్‌కు ముందడుగు

● రూ.2853.23కోట్ల వ్యయంతో రెండో రైలు లేను నిర్మాణం ● విశాఖ పర్యటనలో పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన



బీబీనగర్ రైల్వేస్టేషన్, బీబీనగర్-నడికుడి గుంటూరుకు సింగిల్ లేన్



బీబీనగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బీబీనగర్-గుంటూరు డబ్లింగ్ పనులకు ముందడుగు పడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న సికింద్రాబాద్-వయా నడికుడి- గుంటూరు రెండో లేను రైలు మార్గం పనులకు ప్రధాని మోదీ ఈ నెల 8వ తేదీన విశాఖపట్నం పర్యటనలో భాగంగా డబ్లింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో రెండు రాష్ట్రాల ప్రజలకు రవాణా ప్రయాణ సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయి.

గత ఏడాదే ఆమోదం

బీబీనగర్-గుంటూరు మధ్య రెండో రైలు లేను మార్గం పనులకు గత ఏడాదే కేంద్ర కేబినెట్ వ్యవహారాల కమిటీ డబ్లింగ్ పనులకు ఆమోదం తెలిపింది. పనులు చేపట్టేందుకు దక్షిణమధ్య రైల్వేకు రైల్వే బోర్డు అనుమతులు ఇచ్చింది. మొత్తం నిర్మాణ వ్యయం రూ.2853.23కోట్లు కాగా ఇందులో సిగ్నలింగ్ టెలికాం పనులకు రూ.319.62కోట్లు కాగా సివిల్ పనులకు రూ.1947.44 కోట్లు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ నిర్మాణ పనులకు రూ.586.17కోట్లుగా అంచనా వ్యయంగా నిర్ణయించారు. సికింద్రాబాద్ - విజయవాడకు మధ్య ప్రస్తుతం రెండు రైలు మార్గాలున్నాయి. అందులో ఒకటి ఖాజీపేట, ఖమ్మం.. మరో మార్గం బీబీనగర్ -నడికుడి, గుంటూరు మార్గం ఉంది. ఇది సింగిల్ లైన్ కావడంతో ఒక రైలు ప్రయాణిస్తుంటే ఎదురుగా వచ్చే రైలును ముందు రైల్వేస్టేషన్‌లో పక్కకు ఆపాల్సి వస్తుంది. అదేరెండో లైను నిర్మాణం పూర్తయితే అంతరాయం తప్పడంతో రైళ్ల వేగం పెరుగుతుంది. అదనపు రైలు నడపడానికి అవకాశం ఉంటుంది. బీబీనగర్-గుంటూరు మార్గంలో వంద కిలోమీటర్ల పరిధి రైల్వే ట్రాక్ ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తుండగా 139కిలో మీటర్ల పరిధి రైల్వే ట్రాక్ తెలంగాణ రాష్ట్రం పరిధిలోకి వస్తుంది. ఇప్పుడు సింగిల్ లైను గరిష్ఠ వేగం సామర్థ్యం 130కిలో మీటర్లు కాగా, అదే వందేభారత్ రైలు వేగం సామర్థ్యం 160కిలో మీటర్లుగా ఉంది. ఇప్పుడు చేపట్టనున్న రెండో లైను వేగం సామర్థ్యం 150 నుంచి 160కిలో మీటర్ల వేగాన్ని తట్టుకునే విధంగా నిర్మించనున్నారు.

తగ్గనున్న దూరా భారం

బీబీనగర్-గుంటూరు డబ్లింగ్ పనులు పూర్తి చేసుకుని రెండో లేను మార్గం అందుబాటులోకి వస్తే విజయవాడ, చెన్నై, తిరుపతికి దూర భారం తగ్గనుంది. రవాణాతో పాటు ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుంది. ఈ మార్గంలో అనేక రకాల పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు రవాణాకు సులభతరం కానుంది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రవీణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీడీ ఆంజనేయులు, పీఈటీ రాము

హుజూర్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో 100మీటర్ల అథ్లెటిక్స్‌లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె. ప్రవీణ్ జాతీయ స్థాయి పోటీలకు రెండోసారి ఎంపికయ్యారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఈనెల 11వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. గత ఏడాది డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రవీణ్ పాల్గొన్నాడు. ఈ పోటీలకు ప్రవీణ్ రెండోసారి ఎంపికైనట్లు పీడీ ఆంజనేయులు, పీఈటీ రాము తెలిపారు. గురుకులానికి చెందిన10వ తరగతి విద్యార్థి ఉపేందర్ తమిళనాడులో జరిగిన రెజ్లింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించారు. వారంరోజుల క్రితం తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉపేందర్ రాణించాడు. గత ఏడాది నవంబరు, డిసెంబరులో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించినట్లు ఆంజనేయులు, రాము తెలిపారు. బూరుగడ్డ గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి పి.నరేందర్ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాడు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ప్రవీణ్ 100 మీటర్లు, లాంగ్‌జంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. పాల్వంచలో జరిగిన స్పోర్ట్స్‌మీట్స్‌లో 8వ తరగతి విద్యార్థి సీహెచ్ నితిన్ లాంగ్ జంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. 8వ తరగతి విద్యార్థి స్టీఫెన్ క్యారమ్స్ పోటీలలో వెండిపతకం సాధించారు. ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్, స్పోర్ట్స్‌మీట్ తదితర పోటీల్లో రాణిస్తున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన ప్రవీణ్‌ను ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు, పీడీ ఆంజనేయులు, పీఈటీ రాము తదితరులు అభినందించారు.

పత్తి కొనుగోలు చేయాలి



చిట్యాలలో రాస్తారోకో చేస్తున్న రైతులు

చిట్యాల, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి కొనుగోలు కేంద్రానికి తాము తెచ్చిన పత్తిని నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలకేంద్రంలో సీసీఐ ఆధ్వర్యంలో స్థానిక శ్రీకృష్ణ కాటన్‌మిల్లులో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు చేయడం లేదని చిట్యాలలో జాతీయ రహదారిపై రైతులు గురువారం రాస్తారోకో చేశారు. ట్రాక్టర్ల రహదారిపై ఉంచి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు నుంచి ఎదురు చూస్తున్నా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పత్తి కొనుగోలు నిలిపివేశారని రైతులు వాపోయారు. స్థానిక ఎస్ఐ ధర్మా రైతులు, సీసీఐ అధికారులతో మాట్లాడారు. దీంతో రైతులు రాస్తారోకో విరమింపజేశారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రథమ స్థానం



బహుమతి అందుకుంటున్న డీవీఎం కళాశాల ప్రాజెక్టు రూపకర్తలు

నల్లగొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ఇన్‌స్పైర్‌లో నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలోని చర్లపల్లి డీవీఎం కళాశాల తయారు చేసిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం దక్కింది. ఎగ్జిబిషన్‌లో బీఈడీ కళాశాలల విభాగంలో రాష్ట్రంలోని 13కళాశాలల నుంచి టీచర్ లెర్నింగ్ మెటీరియల్స్ ప్రదర్శన చేయగా నల్లగొండకు చెందిన గైడ్ టీచర్ బొడ్డుపల్లి రామకృష్ణ, ఛాత్రోపాధ్యాయులు పి. అన్నమ్మ, ఎస్. మౌనిక తయారు చేసిన లోకాస్ట్ బీఎల్ఎం విత్ వర్కింగ్ మోడల్ టీఎల్ఎం ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించింది. టీచర్స్ ప్రాజెక్టు విభాగంలో 23మంది టీచర్స్ తన ప్రాజెక్టులను ప్రదర్శించగా చండూరు మండలంలోని పుల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం ఆర్. సరస్వతి ప్రదర్శించిన టీఎల్ఎంకు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారు. రెండు ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల డీఈవో భిక్షపతి, సైన్స్ అధికారి లక్ష్మీపతి హర్షం వ్యక్తం చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయి, ఎస్పీ జానకీ, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రసాద్, డీఈవో ప్రవీణ్‌కుమార్ నుంచి వారు బహుమతులు అందుకున్నారు.

సనాతన ధర్మరక్షణకు పాదయాత్ర దోహదం

చౌటుప్పల్ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ రక్షణకు పాదయాత్ర దోహదం చేస్తుందని పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామిజీ అన్నారు. అఖిల భారత గోసేవా ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ గురుస్వామి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన మహా పాదయాత్రను చౌటుప్పల్ అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద గురువారం జగద్గురు విద్యాశంకర్ భారతీ స్వామిజీ జెండాను ఊపి పునః ప్రారంభించారు. బాలకృష్ణ గురుస్వామి పాదయాత్రలో కొద్ది దూరం స్వామిజీ నడిచి గోప్రేమికులు, భక్తులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా విద్యాశంకర్ భారతీ స్వామిజీ అనుగ్రహ భాషణంచేశారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ బాలకృష్ణ గురుస్వామి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 5వేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. సనాతన ధర్మంలో తల్లి, తండ్రి, గురువు, అతిథి, గోవు ప్రధానమైనవని, ఈ ఐదింటిలో ఏది నిర్లక్ష్యానికి గురైనా ధర్మం బలహీనపడుతుందన్నారు. గోవును రక్షించాలన్న మహాసంకల్పంతో చేపట్టిన పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని, సంకల్పం నెరవేరాలని స్వామిజీ ఆకాంక్షించారు. గోవులో పరమాత్మను చూసుకుంటామని, సకల దేవతలకు నిలయం గోమాత అని స్వామిజీ అన్నారు. మొదటగా గోవును పూజించి పనులను ప్రారంభిస్తామని, సనాతన ధర్మంలో గోవుకు విశేషమైన ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. జాతీయ చిహ్నంగా గోవును పెట్టాలని, గో రక్షణతోనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. గోమాతలో ఉన్న పరమాత్మను ప్రతి ఒక్కరూ గ్రహించాలని, కుల, మతాలకు అతీతంగా గో రక్షణకు పాటుపడాలన్నారు. ధర్మరక్షణకు సాగుతున్న బాలకృష్ణ గురుస్వామి పాదయాత్రకు ప్రతిఒక్కరూ సహకరించాలని, ధర్మరక్షణకు ప్రతి హిందువు సంకల్పదారులు కావాలన్నారు. కశ్మీర్‌నుంచి మూడు నెలలుగా పాదయాత్ర నిర్వహించిన బాలకృష్ణ గురుస్వామి అనారోగ్యం బారిన పడి, కోలుకుని తిరిగి కన్యాకుమారికి పాదయాత్రను పునః ప్రారంభించడం మహా సంకల్పానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, అయ్యప్ప స్వామి దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి గురుస్వామి, కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ, ఎం. రమేష్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, పోలోజు శ్రీలత, బి.సంధ్య, నీరజ, ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ మంజుల, బీజేపీ మండల అధ్యక్షుడు కె.అశోక్ పాల్గొన్నారు.

ముక్కోటికి వేళాయె..!



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశికి పూర్తయిన ఏర్పాట్లు

భువనగిరి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి వేడుకలకు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వివిధ పుష్పాలతో గర్భాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఉత్తర ద్వారం, ప్రాకార మండపానికి విద్యుత్ దీపాలతో దేదీప్యంగా ముస్తాబు చేశారు. ప్రత్యేకంగా గ్రిల్స్‌తో గ్యాలరీలు, కుర్చీలు ఏర్పాటు చేయగా గోపుర ద్వారం అంచులు, వేదికను ఎరుపు వర్ణం వస్త్రం, తిరువీధి రెడ్ కార్పెట్‌తో ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. స్వామివారి శంఖు, చక్ర, నామాలు థర్మకోల్ సహాయంతో వాటిపై గులాబీ, తెల్ల, పసుపు చామంతి పూలను అతికించి అందంగా తీర్చిదిద్దారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం తరలివచ్చే భక్తుల కోసం వేర్వేరుగా ప్రత్యేక గ్యాలరీలు సివిల్ అధికారులు ఏర్పాటు చేశారు. భక్తులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధిక వచ్చే అవకాశాలున్నాయి. ఏకాదశి వేడుకలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సుమారు 10వేల భక్తులు తరలివచ్చే అంచనాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు. నేటి నుంచి ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామివారి నిత్య కైంకర్యాలు గురువారం పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి.

మట్టపల్లిలో ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం

మఠంపల్లి, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి మహాక్షేత్రంలో గురువారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం 5గంటలకు మంగళవాయిద్యాలతో ఆలయ సంప్రదాయాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6గంటలకు వేద మంత్ర పఠనము, 7గంటలకు శాస్త్రీయ సంగీత కచేరి, రాత్రి 9గంటలకు రామతీర్థం సేవాశ్రమం (పిడుగురాళ్ళ), ఆశ్రమ భక్తమండలి, మట్టపల్లి లక్ష్మీనృసింహ భజన బృందం వారిచే శ్రీలక్ష్మీ నృసింహనామ సంకీర్తనము కార్యక్రమాలు నిర్వహిస్తామని ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్‌లు తెలిపారు. మహోత్సవాలకు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారు.

గిరిజన, ఆదివాసీల మధ్య చిచ్చుకు కేంద్రం యత్నం

● పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ● నాగార్జునసాగర్‌లో కొనసాగుతున్న గిరిజన, ఆదివాసీల శిక్షణ



గిరిజన, ఆదివాసీ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నాగార్జునసాగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మనుధర్మం పేరుతో కేంద్రం మతోన్మాదాన్ని సృష్టిస్తూ గిరిజన, ఆదివాసీల మధ్య విభేదాలు తెచ్చేందుకు యత్నిస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ప్రాజెక్టు హౌస్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత గిరిజన, ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశంలో ఐదో రోజైన గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ ఒకే దేశం, ఒకే ప్రధాని, ఒకే అదానీ, ఒకే దేవుడు(రాముడు) అనే నినాదంతో గిరిజనుల, ఆదివాసీల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. గిరిజనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఆ సంక్షేమ చట్టాలను నేడు కేంద్రం నిర్వీర్యం చేస్తోందన్నారు. మణిపూర్, ఛత్తీస్‌ఘడ్, గడ్చిరోలి అటవీ ప్రాంతాల్లో స్థానికంగా ఉండే ప్రజల ఆయా గ్రామ సభల ద్వారా ఉండే అధికారాలను, హక్కులను పక్కనపెట్టి మైనింగ్ కోసం అటవీ భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టింది కానీ గిరిజనులు, ఆదివాసీలు ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. 2006లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో గ్రామాల్లోకి వస్తున్నారు కానీ మానవత్వాన్ని చూపడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీడీఏలను తీసుకొచ్చిందన్నారు. గిరిజనుల, ఆదివాసీల మూలాలను తడిమి చూసుకునేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ, పోడు భూములు, ఐటీడీఏ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. బీజేపీ పాలనలో 10 ఏళ్ల కాలంలో ఏ ఒక్క చట్టం గిరిజన, ఆదివాసీల కోసం తీసుకురాలేదన్నారు. నేడు రాజ్యాంగంపై దాడి చేసి మనుధర్మాన్ని తీసుకురావాలని బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. ఆ కుట్రలను తిప్పికొట్టేందుకే ఈ శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశం అన్నారు. కేంద్రంలో భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప సిద్ధాం తానికి తూట్లు పొడుస్తుందన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్

సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి సీతక్క అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే స్థానికంగా ప్రజాప్రతినిధులు ఉండాలన్నారు. కేంద్రం నుంచి రావల్సిన నిధులు కూడా ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేల ఇవ్వాల్సి ఉండగా రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రూ. 12 వేలకు కుదించామన్నారు.

గిరిజనులు, ఆదివాసీలు ఉన్నతంగా ఎదగాలి: ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు ఐలయ్య, హరగోపాల్

గిరిజనులు, ఆదివాసీలు ఉన్నతంగా ఎదగాలని ప్రొఫెసర్లు హరగోపాల్, కంచె ఐలయ్య అన్నారు. వారు ఉన్నత చదువులు చదివి హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు ముని నాయక్, సక్రూనాయక్, చందునాయక్, నరేందర్‌నాయక్, నాగేశ్వర్ నాయక్, స్వామి నాయక్, పాండు నాయక్, 15 రాష్ట్రాలకు చెందిన 150మంది ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీల్లో కాంస్య పతకం



కాంస్య పతకంతో చందన

బొమ్మలరామారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని జలాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జాగిళ్లపురం చందన కాంస్య పతకం సాధించింది. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించిందని ఆ పాఠశాల పీడీ ర్యాఖల వీరేశం తెలిపారు.

తీరనున్న తాగునీటి సమస్య



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)

» అమృత్ 2.0 పథకం కింద రూ.9.80 కోట్లు మంజూరు
» ముమ్మరంగా సాగుతున్న పనులు

చండూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చండూరు పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు చెక్ పడనుంది. గతంలో మిషన్ భగీరథతో మంచినీటి సమస్య తీరుతుందని భావిస్తే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా ఈ పథకం చండూరు పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో అందడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో అమృత్ 2.0 పథకం కింద చండూరు మునిసిపాలిటీకి రూ.9.80 కోట్లు నిధులు మంజూరవడంతో సమస్య తీరనుంది. ఈ నిధులతో పట్టణ ప్రజలకు తాగునీరు అందించనున్నారు. పనులకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు, గుత్తేదారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే పనులు ముమ్మురంగా కొనసాగుతున్నాయి. 1.5 కిలోమీటర్ల మేర పైపులైన్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మార్చి నెల నాటికి పనులు పూర్తి చేయాలనే నిబంధనలు ఉన్నాయి.

రూ. 9.80 లక్షల నిధులతో పనులు

చండూరు పట్టణంలో నీటి సమస్యను పరిష్కరిందచేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా కేంద్రప్రభుత్వం నిధులు 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు 30 శాతం, మునిసిపాలిటీ నుంచి మరో 20 శాతం నిధులు మొత్తం కలిపి రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన (ఒక్కోటి 5 లక్షల లీటర్లు) రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించనున్నారు. అంతేకాకుండా అవసరం మేరకు పైప్‌లైన్లు వేయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒకటి, సన్‌షైన్ పాఠశాల ఆవరణలో మరో ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. ఇవేకాకుండా అవసరమైన మేరకు పైపులైన్లు వేస్తున్నారు. తాగునీరు అందని ప్రతీ కుటుంబానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పట్టణంలో 11 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 13 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. నూతన ట్యాంకులు, పాతవి కలుపుకుని మొత్తంగా 20 లక్షల లీటర్ల నీటిని పట్టణంలో సరఫరా చేయనున్నారు. పనులు పూర్తయితే పట్టణంలో నీటి సమస్య లేకుండా పోతుంది.

సరిపడా ట్యాంకులు లేకపోవడంతో...

మునిసిపాలిటీ పరిధిలో 10 వార్డులు ఉండగా, 13 వేల వరకు ఓటర్లు ఉన్నారు. సరైన ఓవర్‌హెడ్ ట్యాంకులు లేకపోవడంతో, మునిసిపాలిటీ పరిధిలోని అండిపేట పరిధిలో ఉన్న అనేక కాలనీలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆయా గ్రామాల ప్రజలుర ఎక్కువ భాగం మిషన్ భగీరథ నీటికి నోచుకోలేదు. ప్యూరిఫైడ్ నీటిని కొనుగోలు చేసి తాగాల్సి పరిస్థితి ఏర్పడింది. ఇక నీటి సమస్యకు చెక్ పడుతుండటంతో అనేక కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇబ్బందులు తప్పుతాయి



చండూరు మునిసిపాలిటీ నీటి సమస్య తీర్చేందుకు ఎమ్మెల్యే రాజగోపల్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రజలందరం రుణపడి ఉంటాం. అమృత్ 2.0 పథకం అమలుతో నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు. నీటి ట్యాంకులు పూర్తయితే చండూరు ప్రజల ఇబ్బందులు తీరుతాయి.
- అనంత చంద్రశేఖర్‌గౌడ్, చండూరు

మార్చిలోగా పనులు పూర్తి



చండూరు మునిసిపాలిటీకి అమృత్ 2.0 పథకం కింద రూ.9.80 కోట్లు మంజూరు అయ్యాయి. ఆగస్టు నెలలో ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఒక్కొక్కటి ట్యాంకు 5వేల లీటర్ల సామర్థ్యం గల రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నాం. పైపులైన్లు 1.5 కిలోమీటర్ మేర పూర్తి చేశాం. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు మొదలు పెట్టాం. మార్చి లోగా పనులు పూర్తి చేసి, పట్టణంలో నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.
- నాగప్రసాద్, ఏఈఈ, చండూరు, చండూరు మునిసిపాలిటీ

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్, టీఎస్‌కేసీ సమన్వయకర్త ఎం.అనిల్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 13 మందిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. పిరమల్ క్యాపిటల్ అండ్ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌జీ కళాశాలలోని అల్యూమినియం హాల్‌లో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా నిర్వహించారు. మేళాలో 122 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరిచిన 13 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అందరూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన వారు వారి ప్రతిభను చాటుకొని ఉద్యోగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నతస్థాయికి ఎదగడానికి క్రమశిక్షణతో పాటు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, టాస్క్ క్లస్టర్ మేనేజర్ సుధీర్, తాసిఫ్ పాల్గొన్నారు.



తిప్పర్తి మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశాల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి

నాంపల్లి, తిప్పర్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సర్వేలు, ప్రత్యేక విధులు నిర్వహించిన సిబ్బందికి వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయూ తిప్పర్తి మండల అధ్యక్షుడు బీమగాని గణేష్ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం నాంపల్లి, తిప్పర్తి మండల వైద్యాధికారులు ఇస్రాంబీ, ప్రదీప్‌బాబుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా ఆశావర్కర్లతో ప్రభుత్వం లెప్రసీ, పల్స్ పోలియో సర్వేలు, ఎగ్జామ్‌సెంటర్ల వద్ద పని చేయించుకున్న వేతనాలను ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. అదేవిధంగా కనీస వేతనం రూ.18వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించేంత వరకు కొత్తగా ఎలాంటి సర్వేల్లో కూడా పాల్గొనకూడదని తీర్మానించారు. నాంపల్లి మండలంలోని చిట్టెంపాడు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయంగా రూ.20వేలను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు రమావత్ కవిత, గాదెపాక పుష్ప, కోరే లలిత, సునిత, భాగ్యమ్మ, రేణుక, తిప్పర్తి ఆశా కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు టి.పార్వతమ్మ ఆశాలు ధనమ్మ, పూలమ్మ, పుష్ప, సువర్ణ, రాజేశ్వరి, పద్మ, విజయ, శైలజ, యాదమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

ఆధునిక విద్యతోనే స్త్రీకి విముక్తి



కొంపల్లి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మునుగోడురూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ అన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మునుగోడు మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కాంప్లెక్స్ పరిధిలోని కొంపల్లి, చీకటిమామిడి, చొల్లెడు తదితర పాఠశాలలోని 19 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే శ్రమ ఫలితంగానే ఈనాడు మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని అన్నారు. నేటి మహిళా లోకం సావిత్రీబాయికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో కొంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటనారాయణ, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, నాగమణి, పద్మావతి, జ్యోతి, విజయలక్ష్మి, యాదమ్మ, ఆఫీజా బేగం, స్వాతి, శైలజ, ధనలక్ష్మీ, చంద్రిక, శౌరీలు, ప్రదీప్, నూర్జహాన్, జ్ఞానేశ్వరి, నాయకులు పెరిక నరసింహ, సుధాకర్‌రెడ్డి, అన్న మేరి, సంజీవయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు సతీష్, శ్రీనివాస్

చిట్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని గోరక్ష మహా పాదయాత్ర సారధి బాలకృష్ణ గురుస్వామి డిమాండ్ చేశారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని గోరక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గోరక్ష మహాపాదయాత్ర గురువారం రాత్రి చిట్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 14 రాష్ట్రాల గుండా 4900 కిలోమీటర్లు కొనసాగుతుందని తెలిపారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించేందుకు అందరూ సహకరించాలని కోరారు. పాదయాత్రకు ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు దౌలాతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంబాలపల్లి సతీష్, మాస శ్రీనివాస్, గంజి గోవర్ధన్, కుర్రబోయిన వేణు, పాల రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు వెయ్యి గొంతులు' సభ జయప్రదం చేయాలి

నార్కట్‌పల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు మేడి నర్సింహ, బోడ ఎల్లయ్య పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో మాదిగలు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు లింగాల యాదయ్య, చింత లక్ష్మణ్, శివశంకర్, విజయ్, సునీల్, తోటకూరి అశోక్, లింగాల రాజు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి

● చండూరు ఆర్డీవో శ్రీదేవి



మర్రిగూడలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఆర్డీవో శ్రీదేవి

మర్రిగూడ, నాంపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉండేందుకే చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 91 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ తారకరామన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌నాయక్, అయితగోని వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, వెంకటంపేట బాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్నమనేని రవీందర్‌రావు, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో ప్రభుత్వం నుంచి మంజూరైన 78 కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దేవసింగ్ లబ్ధిదారులకు అందజేశారు. ఆర్ఐ దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, పానగంటి వెంకటయ్య, నేతాళ్ల కొండల్, గాదెపాక రాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి: డీటీసీ వాణి



ముగ్గుల పోటీల్లో చిన్నారులకు బహుమతులు అందజేసిన అనంతరం మాట్లాడతున్న డీటీసీ వాణి

నల్లగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని డీటీసీ వాణి అన్నారు. పట్టణంలోని డైట్ కళాశాల ఆవరణలో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. రోడ్డు భద్రత, అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎంవీఆర్ స్కూల్ విద్యార్థులు, జూనియర్ కళాశాల, డైట్ కళాశాల విద్యార్థులతో రోడ్డు భద్రతా ఏర్పాట్ల అంశాలపై రంగవల్లులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డుపైన ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించి ముందుకు వెళితే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని, రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఉండాలని సూచించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ లావణ్య, స్వప్న, సోనిప్రియా, అంవి, ఉషాశ్రీ, కిరణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలి



చెరువు అన్నారంలో క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో అంజయ్య

కట్టంగూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ క్రీడాకారుడు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించడానికి కృషి చేయాలని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. మండలంలోని చెరువుఅన్నారం హైస్కూల్ గ్రౌండ్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు శిక్షణ శిబిరాన్ని ఎంఈవో అంజయ్య, నకిరేకల్ ఏవీఎం కళాశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నశ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. జట్టులోని క్రీడాకారులను పరిచయం చేసుకొని, క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నల్లగొండ జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని సూచించారు. హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరానికి కందాల స్వప్న శ్రీకాంత్‌రెడ్డి రూ.4వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సట్టు గోపి, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నగేష్, లింగయ్య, సంపత్ కుమార్, మంగ, ఏవీఎం వ్యాయామ ఉపాధ్యాయులు నిమ్మల శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నిక

రామగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి, రాష్ట్ర అధికారి ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ, వన్‌టౌన్ అధ్యక్షుడిగా బంటు యాదగిరి, టూటౌన్ అధ్యక్షుడిగా పెద్దబోయిన వెంకటేష్‌యాదవ్, మిర్యాలగూడరూరల్ జంగిల్ రవికుమార్, వేములపల్లి మండల అధ్యక్షుడిగా పి.భరత్, త్రిపురారం రెమిడాల రమేష్, గుర్రపోడు మామిడి వినోద్‌కుమార్, మాడ్గులపల్లి మండల అధ్యక్షుడిగా ఇటుకల జాన్‌రెడ్డి, నల్లగొండ టూటౌన్ అధ్యక్షుడిగా మిర్యాల వెంకటేశ్వర్లు, తిప్పర్తి మండల అధ్యక్షుడిగా వంగూరి రవి, చిట్యాల మండల, పట్టణ అధ్యక్షులుగా పీక వెంకన్నముదిరాజ్, గుండాల రమేష్‌గౌడ్, కట్టంగూరు మండల అధ్యక్షుడిగా నీలా నాగరాజుగౌడ్, నకిరేకల్ రూరల్ అధ్యక్షుడిగా బురిగ సైదులు, రామన్నపేట పట్టణ అధ్యక్షుడిగా బండ మధుకర్‌రెడ్డి, కేతేపల్లి మండల అధ్యక్షుడిగా పిట్టల వెంకట్, చౌటుప్పల్ అధ్యక్షురాలిగా కడారి కల్పన, సంస్థాన్‌నారాయణపురం మండల అధ్యక్షుడిగా సుర్వి రాజుగౌడ్, గట్టుపల్ రావుల ఎల్లప్ప, చండూరు మండల, పట్టణ అధ్యక్షులుగా ముదిగొండ ఆంజనేయులు, పందుల సత్యనారాయణ, నాంపల్లి మండల అధ్యక్షుడిగా దాచపెల్లి నర్సింహ, మర్రిగూడ పాల్వావత్ రాజేంద్రనాయక్, చందంపేట గుంటోజు వినోదాచారి, చింపల్లి సముద్రాల నగేష్, కనగల్ పర్సనబోయిన భిక్షం, చౌటుప్పల్ మండల అధ్యక్షుడిగా కైరకొండ అశోక్, దేవరకొండ పట్టణ అధ్యక్షుడిగా వసుకుల సుధాకర్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

ఎల్లమ్మ సన్నిధిలో భక్తుల కోలాట ప్రదర్శన



కోలాట ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

కనగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి గురువారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె, ఒడి బియ్యం, బోన నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకున్నారు. నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన మహిళా కోలాట బృందం సభ్యులు 30 రోజుల శిక్షణ పూర్తి చేసుకుని అమ్మవారి సన్నిధిలో కోలాట ప్రదర్శన చేసి మొక్కు చెల్లించుకున్నారు.



వైకుంఠ ఏకాదశికి నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల రామాలయాన్ని ముస్తాబు చేస్తున్న భక్తులు

మొక్కలు నాటిన ఎన్‌సీసీ కేడేట్లు

శాలిగౌరారం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లా ల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో గురువారం ఎన్‌సీసీ పరేడ్ కార్యక్రమం లో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటా రు. పరేడ్ ఇన్‌చార్జి రాజు, స్కూల్ ఎన్‌సీసీ ఇన్‌చార్జి కాసు సంధ్యారాణి, ఆంగ్ల ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు కుక్కడపు శ్రీనివాస్, కేతేపల్లి శ్రీను, దామెర్ల కృష్ణయ్య, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహయ్య సేవలు మరువలేనివి



నర్సింహయ్య ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నోముల నర్సింహయ్య సేవలు మరువలేనివని సోమన్న మిత్రమండలి నాయకులు గాదగోని కొండయ్య, మాద యాదగిరి అన్నారు. మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య జయంతి వేడుకలను గురువారం సోమన్న మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మిత్రమండలి నాయకులు గాదగోని కొండయ్య, మాద యాదగిరి, మాచర్ల సైదులు, బొజ్జ సుందర్, వంటెపాక వెంకటేశ్వర్లు, పాటి యాదగిరి, శ్రీను, అంబేద్కర్, శేఖర్‌రెడ్డి, సైదులు, కృష్ణ, సుధాకర్, లింగయ్య, విజయ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో క్రీడా పోటీల పోస్టరును ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య

శాలిగౌరారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ తిరుపారి మల్లేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బీమనబోయిన శంకర్, ఉపేందర్, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడలు దోహదం

గట్టుప్పల్: విద్యార్థులకు ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడలు ఉపయోగపడుతాయని ఎంఈవో అమృతాదేవి అన్నారు. సంక్రాంతి సందర్భంగా గురువారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గట్టుప్పల్ హైస్కూల్‌లో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయడానికి డీవైఎఫ్ఐ మంచి ప్రయత్నం చేస్తుందని కొనియాడారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యువతీ, యువకులను, విద్యార్థులను ఉత్తేజపరచడానికి దోహదపడతాయని అన్నారు. కుల, మత భేదాలు లేకుండా విద్యార్థులు, యువతీ, యువకులు స్నేహభావంతో మెలిగే విధంగా క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపన్యాసం, ముగ్గుల పోటీలు, పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భావన, చందన, వర్షిత, పావని, శ్రీవిద్య, అక్షయ్, తులసి గెలుపొందగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ పసుపుల ఏడుకొండల్, మాజీ డివిజన్ నాయకులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, డీవైఎఫ్ఐ నాయకులు పసుపుల నవీన్, జతీన్, సురేందర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

14 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

నల్లగొండ: కేవీఆర్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు కనగల్ మండలం చినమాదారం గ్రామంలో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం క్రికెట్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో చిన్నసూరారం గ్రామ మాజీ సర్పంచ్ సంకు ధనలక్ష్మి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేవీఆర్ సతీష్, నాయకులు సైదులు, జచిన్ గోయల్, నాని తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 ; కనిష్ఠం 15.8



ముక్కోటి ఏకాదశి వేడుకలకు ముస్తాబైన జిల్లాకేంద్రంలోని రామాలయం

ముక్కోటికి ముస్తాబు

- నేడు ముక్కోటి ఏకాదశి
- ముస్తాబైన వైష్ణవాలయాలు
- స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వైష్ణవాలయాలన్నీ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారు శుద్ధ ఏకాదశి రోజున ఉత్తర ద్వార నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకుంటే పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. సూర్యుడు ఉత్తరాయణానికి చేరే ముందు వచ్చే ధనుర్మాస వైకుంఠ ఏకాదశికి ప్రత్యేకత ఉంది. అందువల్ల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు ఆరాటపడుతుంటారు. ఉత్తరద్వారం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ఉత్తర ద్వారాన్ని ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేకంగా ఏర్పాటు వేదికలో స్వామివారు ఆశీనులు కాగా భక్తులు దర్శించుకోనున్నారు. ఉదయం 5 గంటలకే భక్తులు బారులుతీరనున్నారు. ఆలయాలను వివిధ రకాల పుష్పాలు, వివిధ రంగులతో అలంకరించారు. భక్తులు, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకోనున్నారు. శ్రీమాన్ భాష్యం జగన్నాథాచార్యులతో తిరుప్పావై ప్రవచనం సాగనుంది. వికాస తరంగిణి భక్తులు సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేయనున్నారు. అదేవిధంగా వీటీకాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం, షేర్‌బంగ్లా సంతోషిమాత దేవాలయం వేడుకలకు ముస్తాబయ్యాయి. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అర్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో అన్న కూటోత్సవం హోమాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్య హాజరై స్వామివారి దర్శించుకొని పరవశించిపోయారు.

సాగునీటి రంగానికి మొదటి ప్రాధాన్యం

- ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్




డిండిలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో సాగునీటి రంగానికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. గురువారం డిండి మండల కేంద్రంలో రూ.3.5కోట్లతో నిర్మించతలపెట్టిన సీసీ, బీటీరోడ్ల పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సాగు ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతలతోపాటు నియోజకవర్గంలో చేపడుతున్న లిఫ్టులను పూర్తి చేసి నిత్యం కరువుకు గురవుతున్న దేవరకొండ నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామన్నారు. డిండి ఎత్తిపోతలకు ఎదుల్ల నుంచి నీరు తీసుకునేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.1800కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ చైర్మన్ జమున మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, మత్స్యశాఖ అధికారి చరిత, ఎంపీడీవో వెంకన్న, గుర్రం రాములు, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, సిరాజ్‌ఖాన్, యాదగిరిరావు, శ్రీనివాస్‌గౌడ్, బుషిపాక పాల్గొన్నారు.

చందంపేట: ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి, డిండి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌లు అన్నారు. గురువారం చందంపేట మండలం వీరన్నగూడెంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్‌కు తమ సమస్యలపై వినతిపత్రమిస్తోన్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)



నిధుల్లేవ్

గ్రామపంచాయతీల్లో పాలన కుంటుపడింది. పాలకవర్గాల్లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలిచ్చే గ్రాంట్లు పెండింగ్‌లో పడిపోవడంతో అభివృద్ధి నిలిచిపోయింది. పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు పంచాయతీల్లో అత్యవసర పనులకు సొంత నిధులు వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు బిల్లులురాక అప్పులపాలై ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అప్పులు చేసి పను లు చేయించడంతోపాటు, మరోవైపు అదన పు పనులతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. దాదాపు 11 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడంతో భారమంతా తమపైనే పడిందని కార్యదర్శులు మదనపడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- కుంటుపడిన పంచాయతీల పాలన
- పాలకవర్గాల్లేక నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు
- ఏడాదిగా 15వ ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్
- 30 నెలలుగా విడుదల కాని రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల్లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, దానికి సరిసమానంగా ఇచ్చే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన ఈ నిధులు మంజూరవుతాయి. జిల్లాలో ప్రస్తుతం ఏడాది కాలానికి సంబంధించి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, 30నెలలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో, పంచాయతీల్లో పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ప్రధానంగా ఈనిధులతోనే ట్రాక్టర్లకు ఈఎంఐ చెల్లించడం, మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వడం, డీజిల్ ఖర్చులు, ఇంకా వీధిదీపాల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు, సీసీరోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీల నిర్మాణాలు, నిర్వహణ చేపట్టేవారు. ప్రస్తుతం ఈ నిధులన్నీ నిలిచిపోవడంతో పంచాయతీల్లో తప్పనిసరిగా చేయాల్సిన వీధిదీపాల ఏర్పాటు, డీజిల్ ఖర్చులు, నల్లాల ఏర్పాటు, మోటార్ల మరమ్మతుల వంటి వాటికి ఇంటిపన్నులపైనే కార్యదర్శులు ఆధారపడాల్సి వస్తోంది. పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల నుంచి కొంత ఒత్తిడితోనైనా ఒప్పించి ఇంటి పన్నులు వసూలు చేస్తూ ఈ పనులు చేయిస్తుండగా, మిగిలిన తప్పనిసరి పనులకు కార్యదర్శులు తమ సొంత నిధులు వెచ్చించి పనులు చేయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.615.86కోట్ల నిధుల పెండింగ్

ఉమ్మడి జిల్లాలో కేంద్ర 15వ ఆర్థిక సంఘంనుంచి నల్లగొండ జిల్లాకు ప్రతీ మూడు నెలలకు రూ.19.50కోట్లు వస్తే...

- మిగతా 5వ పేజీలో...

ఎంజీయూ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- రూ.260కోట్లతో అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ఒక విజన్‌తో మహాత్మాగాంధీ యూనివర్సిటీని సంపూర్ణంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 2007లో నల్లగొండలో ఏర్పాటైన యూనివర్సిటీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుంది. అయితే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం కోసం రూ.260కోట్లతో యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వంతో పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి అనేక నిర్ణయాలు చేపట్టిన నేపథ్యంలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు.

(నల్లగొండ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: యూనివర్సిటీ అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తున్నారు?

ఉపకులపతి: నేను గతంలో ఇదే యూనివర్సిటీలో

- మిగతా 4వ పేజీలో...

చర్లగూడ రిజర్వాయర్ పనుల అడ్డగింత

- పునరావాసం కల్పించాలని డిమాండ్



పనులను అడ్డుకుంటున్న చర్లగూడెం నిర్వాసితులు

సనాతన ధర్మరక్షణకు పాదయాత్ర

- పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు విద్యా శంకర భారతీ స్వామిజీ



అనుగ్రహ భాషణ చేస్తున్న విద్యాశంకర్ స్వామిజీ

బీబీనగర్-గుంటూరు డబ్లింగ్‌కు ముందడుగు

- విశాఖ పర్యటనలో పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన



బీబీనగర్ రైల్వే స్టేషన్

'ధరణి'లో సమస్యలు లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు, మర్రిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ధరణిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత తహసీల్దార్లపై ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం జిల్లాలోని చండూరు, మర్రిగూడ మండలాల్లో పర్యటించారు. చండూరు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైళ్లు, ధరణి పోర్టల్‌ను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ధరణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. భూసమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో సందర్శన తర్వాతే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా భూసమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. మర్రిగూడ మండల కేంద్రంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేపట్టారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, ఎస్టీ హాస్టల్, కేజీబీవీ పాఠశాలను సందర్శించి పలు రికార్డుల ను పరిశీలించారు. అధికారుల విధి నిర్వహణ, పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వైద్యం కోసం నిరుపేదలు వస్తారని, వారికి మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందించాలని సూచించారు. ఓ గర్భిణి ప్రభుత్వాస్పత్రిలో తన పేరు రిజిస్టర్ చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పుకోసం వెళ్లడంపై డాక్టర్లను మందలించారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉండగా ప్రైవేట్ ఆస్పత్రిని ఎందుకు ఆశ్రయించిందని ప్రశ్నించారు. మండలంలో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు దృష్టి సారించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవికి సూచించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులను వారి సమస్యలను అడిగి తెలుసుకోగా మందులు సక్రమంగా లేవని బయటకు రాస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థినులకు పాఠాలు బోధించిన కలెక్టర్



విటమిన్ లోపం ఎలా అధిగమించాలనే అంశంపై కలెక్టర్ ఇలాత్రిపాఠి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. కేజీబీవీని ఆమె పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలోని 8వ తరగతి గదికి వెళ్లిన ఆమె వారికి సైన్స్ పాఠ్యాంశంపై కొద్దిసేపు పాఠాలు బోధించారు. మోతాదుకు మించిన యాంటీబయాటిక్ హానికరమని, ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇష్టంతో చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. పాఠశాలలో గదులు సరిపోవడం లేదని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రిన్సిపాల్ జ్యోతితో మాట్లాడారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 280మంది విద్యార్థినులు ఉండగా, 13గదులు ఉన్నాయని, తొమ్మిది గదులు అవసరమవుతాయని ప్రిన్సిపాల్ చెప్పటంతో నిధుల మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేసి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో చండూరు ఆర్డీవో శ్రీదేవి, చండూరు తహసీల్దార్ దశరథ, మండల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన, ఆదివాసీల మధ్య విభేదాలకు కేంద్ర ప్రభుత్వం యత్నం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- నాగార్జునసాగర్‌లో కొనసాగుతున్న గిరిజన, ఆదివాసీల శిక్షణ



నాగార్జున ఆదివాసీ శిక్షణ తరగతుల్లో సంప్రదాయ వస్తువులతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మెనూ అమలవుతోందా..?

కేజీబీవీ విద్యార్థినులతో డీఈవో

మునుగోడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మెనూ అమలవుతుందా..? అని జిల్లా విద్యా శాఖాధికారి భిక్షపతి అన్నారు. మునుగోడుమండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. వివిధ తరగతులకు వెళ్లి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యాబోధన, మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వంటశాలలను పరిశీలించి వంటలను రుచి చూశారు. నిర్దేశించిన ప్రకారం నిబంధనలను పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. మెనూ పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా బోధన

● కొండమల్లేపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల నమోదులో జిల్లాలోనే మొదటి స్థానం ● 6 నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల బోధన

కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అడ్మిషన్లు. అంకిత భావవంతో పని చేసే ఉపాధ్యాయులు ఇది కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరిస్థితి. ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధిస్తూ జిల్లాలోనే విద్యార్థుల నమోదులో మొదటి స్థానంలో నిలిచింది.

-కొండమల్లేపల్లి,(ఆంధ్రజ్యోతి)



కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



డిజిటల్ క్లాసులో తరగతి బోధన(ఫైల్)

కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీగానే కాకుండా విద్యాబోధనలోనూ ప్రత్యేక గుర్తింపు ఉంది. కార్పొరేట్ స్థాయిలో అడ్మిషన్లు నమోదవుతున్న ఈ పాఠశాలలో అదే స్థాయిలో ఆకట్టుకునే డిజిటల్ బోధన జరుగుతోంది. ఇక్కడి పాఠశాలలో అడ్మిషన్లకు పోటీ ఉం దంటే అతిశయోక్తి కాదు. జిల్లాలోనే అత్యధికంగా 955 మంది విద్యార్థులు నమోదై ఉండగా, ఈ పాఠశాలలో 54 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకునేలా డిజిటల్ తరగతులు

విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే రీతిలో డిజిటల్ విద్యా బోధన కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం అంతేకాకుండా అడ్మిషన్ల కోసం తీవ్ర పోటీ ఉండడంతో తరగతులు సెక్షన్లుగా విభజించి విద్యా బోధన కొనసాగిస్తు న్నారు. అలాగే. ఈ ఏడాది 30 మంది స్కాట్ కింద ఎంపికై జిల్లా స్థాయి లో శిక్షణకు ఎంపికయ్యారు.

పదిపై స్పెషల్ ఫోకస్

ఈ విద్యా సంవత్సరం 212 మంది పదో తరగతిలో విద్య నభ్యసిస్తున్నారు. వీరిలో బాలురు 132, బాలికలు 80 మంది ఉన్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారిగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమిస్తున్నారు.

వివిధ విభాగాల్లో ప్రతిభ

పాఠశాల నుంచి విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. అలాగే చెకుముకి టాలెంట్ టెస్ట్, సైన్స్ ఫెయిర్ అలాంటి అంశాల్లో నిర్వహించే పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ అబ్బురపరుస్తున్నారు. చెకుముకి పోటీల్లో మాదక ద్రవ్యాల అంశంపై పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని బొడ్డుపల్లి స్పందన జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. తాజాగా సైన్స్ ఫెయిర్ పోటీల్లో సేంద్రియ ఎరువులు అంశంపై విద్యార్థి భూతరాజు సాయి వర్షిత్ రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యాడు.

గణితంపై ప్రత్యేక తరగతులు

గణితం అంటే భయం పోగొట్టేందుకు పాఠశాల గణిత విభాగం ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల గణిత సందేహాలను నివృతి చేస్తు నాట్నారు. పాఠశాల విద్యార్థులను ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలలకు ఎంపికయ్యేలా తీర్చి దిద్దుతున్నారు.

దాతల సహకారంతో అదనపు హంగులు

పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పనకు దాతల సహకారం తీసుకుంటున్నారు. మాజీ ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి పాఠశాలలో సీసీ కెమెరాలు, బెంచీలు, ఫర్నిచర్, కుర్చీలు, టేబుళ్లు, విద్యుదీకరణ, పాఠశాల భవనానికి రంగులు వేయిం చడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు కొత్త భవన నిర్మాణానికి సహకారం అందించారు. ఈ విద్యా సంవత్సరం రూ.5 లక్షలు విలు వైన టై, షూ, బ్యాడ్జిలు, ఐడీ కార్డులు, కంప్యూటర్, ప్రింట టర్లను అందజేశారు. ఇటీవల కొండ మల్లేపల్లికి చెందిన డాక్టర్ వేదం ఆంజనేయ శాస్త్రీ తన భార్య వేదం లక్ష్మి జ్ఞాపకార్థంగా పాఠశాల పేరిట రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీనిపై వచ్చే వడ్డీని పాఠశాలలో 9వ తరగతి లో ఉత్తమమార్కులుసాధించిన వారికి బహుమతులు అందించేందుకు వెచ్చించనున్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధిస్తారు

ప్రైవేటు పాఠశాలలో చదువు బాగా చెప్తారనేది అపోహ మాత్రమే. మా పాఠశాలలో పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తారు. మధ్యాహ్నం సన్నబియ్యంతో భోజ నం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందజేశారు.



- గంజి హారిక, 10వ తరగతి

వెనుకబడిన వారికి తరగతులు నిర్వహిస్తున్నాం

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు తీసుకొని ప్రోత్సహిస్తున్నాం. పది ఫలితాల్లో పది జీపీఏ సాధించేందుకు కృషి చేస్తూనే ట్రిపుల్ ఐటీ పాలిటెక్నిక్, రెసిడెన్షియల్ ప్రవేశాలకు విద్యార్థులు ఎంపికయ్యేలా తర్ఫీదు ఇస్తున్నాం. స్కాట్ ఎంపికైన 30 మంది విద్యార్థులకు యూనిఫామ్ కోసం దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్నాం.- రమావత్ నాగేశ్వర్‌రావు నాయక్, హెచ్‌ఎం

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, నిర్వాహకులు

తిరుమలగిరి(సాగర్),జనవరి9(ఆంధ్రజ్యోతి):మండలంలోని సపావత్‌తండాలో ఈ నెల 11 నుంచి నిర్వహించనున్న ఎస్‌పీఎల్-3 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల కరపత్రాలను నాగార్జునసాగర్‌లో ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సైదాచారి మాట్లాడుతూ విజేతలకు ప్రథమ బహుమతి రూ.25,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.10,116లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరావత్ మునినాయక్, వెంకటేష్ చౌహాన్, లక్పతినాయక్, పాండు, సైదాచారి, భాస్కర్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

హాలియా, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్, హాలియా జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వి.రాములు అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆయన పాల్గొని మాట్లాడారు. తాను కూడా ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించానని, అప్పటి ప్రధానోపాధ్యాయుడు ఎం.రామాచార్యులు ఆశీస్సులతో తాను ఉన్నత విద్యను అభ్యసిం చానన్నారు. కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, హెచ్‌ఎం గుండా కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు నాగిరెడ్డి, జలీల్, షరీఫ్, ఝాన్సీ, వహమ్మద్, వెంకటయ్య, ఆదిరెడ్డి, ప్రసాద్, అక్కయ్యబాబు పాల్గొన్నారు.

ఫాతీమాషేక్‌కు ఘన నివాళి



దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫాతీమా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దేవరకొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ముస్లిం తొలి మహిళ ఉపాధ్యాయురాలు ఫాతీమాషేక్ 194వ జయంతిని దేవరకొండలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దేవరకొండ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఫాతీమాషేక్ చిత్రపటానికి ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సావిత్రిబాయిపూలేతో కలిసి విద్యాభివృద్ధికి, పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందించిన ఘనత ఫాతీమాషేక్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అంజనేయులు, నాయకులు సహదేవుడు, ఎర్ర యాదగిరి, గుద్దేటి సైదులు, వెంకటచారి పాల్గొన్నారు.

కస్తూర్బా ఆశ్రమ పాఠశాల తనిఖీ

నేరేడుగొమ్ము, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గిరిజన ఆశ్రమ పాఠశాలను ప్రత్యేక అధికారి జంగయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో విద్యార్థులు మంచి ర్యాంకులు పొందాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు విద్యను అభ్యసించాలన్నారు. ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు సక్రమంగా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో రఘు, ఎంపీడీవో ప్రవీణ్, శ్రీధర్, ఉపాధ్యాయులు లింగయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆశాలకు సర్వే డబ్బులు చెల్లించాలి

దామరచర్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ సర్వేలు చేయించిన సందర్భంలో ఆశా కార్యకర్తలకు ఇస్తామన్న డబ్బులు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ కోరారు. ఈ మేరకు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మండల వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది లెప్రసీ, పల్స్ పోలియో సర్వేలతో పాటు వివిధ పరీక్షా కేంద్రాల వద్ద డ్యూటీలకు డబ్బులు ఇస్తామని చెప్పి పనిచేయించుకొని ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మహే శ్వరి, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



తిమ్మారెడ్డిగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న పుట్టల కృపయ్య, రావు ఎల్లారెడ్డి తదితరులు

వేములపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు కార్యక్రమంలో పీఆర్ ఏఈ బిందు, పంచాయతీ కార్యదర్శి సామ్రాజ్యం, దేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వల్లపుదాసు వెంకటయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, కోటి, నగేష్, రమేష్ శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నిక

రామగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి, రాష్ట్ర అధికారి ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ, వన్‌టౌన్ అధ్యక్షుడిగా బంటు యాదగిరి, టూటౌన్ అధ్యక్షుడిగా పెద్దబోయిన వెంకటేష్‌యాదవ్, మిర్యాలగూడ రూరల్ జంగిల్ రవికుమార్, వేముపల్లి మండల అధ్యక్షుడిగా పి.భరత్, త్రిపురారం రెమిడాల రమేష్, గుర్రంపోడు మామిడి వినోద్‌కుమార్, మాడ్గులపల్లి మండల అధ్యక్షుడిగా ఇటుకల జాన్‌రెడ్డి, నల్లగొండ టూటౌన్ అధ్యక్షుడిగా మిర్యాల వెంకటేశ్వర్లు, తిప్పర్తి మండల అధ్యక్షుడిగా వంగూరి రవి, కట్టంగూరు మండల అధ్యక్షుడిగా నీలా నాగరాజుగౌడ్, నకిరేకల్ రూరల్ అధ్యక్షుడిగా బురిగ సైదులు, సంస్థాన్‌నారాయణపురం మండలాధ్యక్షుడిగా సుర్వి రాజుగౌడ్, గట్టుప్పల్ రావుల ఎల్లప్ప, నాంపల్లి మండల అధ్యక్షుడిగా దాచపెల్లి నర్సింహ, మర్రిగూడ పాత్లావత్ రాజేంద్రనాయక్, చందంపేట గుంటోజు వినోదాచారి, చింపల్లి సముద్రాల నగేష్, కనగల్ పర్సనబోయిన భిక్షం, చౌటుప్పల్ మండల అధ్యక్షుడిగా కైరకొండ అశోక్, దేవరకొండ పట్టణ అధ్యక్షుడిగా వనుకుల సుధాకర్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న పశువైద్యాధికారి

ముల్కలకాల్వలో పశువైద్య శిబిరం

మాడ్గులపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పోచంద్ర వానిగూడెంలో గురువారం గోపాలమిత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 63 గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వైద్యాన్ని అందించామని, 31 దూడలకు నట్టల నివారణ మందులను తాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, మాజీ సర్పంచ్ చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎంవీఐ వీరాస్వామి



అవగాహన కల్పిస్తున్న వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి

మిర్యాలగూడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. వీరాస్వామి అన్నారు. గురువారం వాహనాల ఫిట్‌నెస్ కోసం, నూతన డ్రైవింగ్ లైసెన్స్‌లు, రెన్యువల్స్ తదితర పనుల నిమిత్తం ఆర్‌టీఏ కార్యాలయానికి వచ్చిన వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం నిత్యం రోడ్డు దాటి మేత కోసం పొలాలకు వెళ్లే పశువులను గుర్తించి సిబ్బంది ద్వారా వాటి కొమ్ములకు రేడియం స్టిక్కర్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగం కన్నా భద్రంగా గమ్యస్థానం చేరడమే ముఖ్యమని అన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రమా దాలు ఎక్కువగా జరిగే వీలుందని ఎట్టి పరిస్థి తుల్లోనూ తాగి వాహనాలు నడపరాదని అన్నారు. రాంగ్‌రూట్లో ప్రయాణం ఆత్మాహుతి బాంబు లాంటిదని తను ప్రమా దంలో పడటమే కాకుండా ఎదురుగా వచ్చే వారికి ప్ర మాదం కల్పిస్తాడని చెప్పారు. డ్రైవింగ్‌లో సీనియారిటీ కన్నా అనుక్షణం అప్రమత్తతే సురక్షితంగా గమ్యాన్ని చేరుస్తుందన్నారు. వాహనాల ఫిట్‌నెస్‌పై అప్ర మత్తత అవసరం అన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సిబ్బంది హరి, గోపిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని దేవరకొండ సీఐ నర్సింహులు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 నంబర్ తోపాటు దేవరకొండ పోలీస్‌స్టేషన్ సెల్. 8712675522 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అకౌంట్, ఆధార్ కార్డు నంబర్ అడిగితే ఇవ్వవద్దన్నారు. దేవరకొండలో రాజరాజేశ్వరి సిమెంట్‌షాపు యజమాని రామకృష్ణ వద్దకు వచ్చి సిమెంట్ కొనుగోలు చేస్తానని ఫోన్‌కు హాయ్ అని పెట్టాలని, మా అన్న డబ్బులు పంపిస్తాడని చెప్పి టోకరా చేసి గుర్తు తెలియని వ్యక్తి రూ.70వేలు కాజేశాడని అన్నారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలు, ఫోన్‌నంబర్ లోకేషన్ ఆధారంగా విచారణచేస్తున్నామని సీఐ తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

దేవరకొండ,జనవరి9(ఆంధ్రజ్యోతి): నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వర, కోదండ రామాలయం, అయ్యప్ప స్వామి, షిర్డీసాయిబాబా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని, నిర్వాహకులు గురువారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు.

● చింతపల్లి : గొడుకొండ్ల, వీ.టీనగర్ వేంకటేశ్వర, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం : ఎస్ఎఫ్ఐ

దేవరకొండ, జనవరి9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందని ఆ సంఘం జిల్లా సహా య కార్యదర్శి బుడిగె వెంకటేష్ అన్నారు. గురువారం దేవరకొండలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మనోజ్, యశ్వంత్, ఆంజనేయులు, చరణ్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

మిర్యాలగూడ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి):ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హరిబాబు హెచ్చరించారు. మండలంలోని అలగడపలో గురువారం సర్వే నంబర్ 833లో గల 1.30ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించి కబ్జాకు గురి కాకుండా బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నర్సింహయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



నర్సింహయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భగత్, నాయకులు.

నిడమనూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య నిత్యం పేద ప్రజల కోసమే తపించి పని చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నర్సింహయ్య 69వ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని వేంపాడ్ స్టేజీ వద్ద ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ నర్సింహయ్య పదవిలో ఉన్నా, లేకున్నా తన పోరాటాన్ని ఏనాడు ఆపలేదని, ప్రజల కోసమే చివరి వరకు పని చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి నర్సింహయ్య చలవేనన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు సాదం సంపత్‌కుమార్, బొల్లం జయమ్మ, తాటి సత్యపాల్, బొల్లం రవియాదవ్, కూరాకుల వెంకటేశ్వర్లు, పిల్లి రమేష్, నల్లబోతు వెంకటేశ్వర్లు, మాచర్ల దాసు, గడ్డం సత్యనారాయణరెడ్డి, ఆదిముల్ల భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత

తిరుమలగిరి(సాగర్), జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునితండా గ్రామంలోని క్రీడాకారులకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సహాయంతో గురువారం మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి క్రికెట్ కిట్టును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాయక్, క్రీడాకారులు తులసీరాం, మోతీలాల్, రాగ్యా, దత్తా, రాజేష్, బాబు, రంగా తదితరులు పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకుందాం



నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ ప్రజా సంఘాల నేతలు

మిర్యాలగూడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను కాపాడుకుందాం అని ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బీసం రామయ్య అన్నారు. గురువారం మిర్యాలగూడ ప్రోగెసీవ్ ఫోరం, తెలంగాణ విద్యావంతుల వేదిక, జనవిజ్ఞాన వేదిక, ముస్లిం విద్యావంతుల వేదిక, డీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అమర వీరుల స్థూపం వద్ద రచయితలు, దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పౌర సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్న కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులపై మత వాదుల దాడులు పెరుగు తున్నాయని అన్నారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ పై, ఉచ్చల జలధి తరంగా పుస్తకాన్ని సంకలనం చేసిన మెర్సీ మార్గరేట్‌పై, రంగారెడ్డి జిల్లా తుక్కు గూడెం గెజిటెడ్ హెడ్ మాస్టర్ రాములుపై జరుగుతున్న దాడులు ఇందుకు నిదర్శమన్నారు. విద్వేషపు దాడులను ఖండి స్తూ భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోలేక పోతే మున్ముందు ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గతంలో రంగనాయకమ్మ రామాయణ విషవృక్షం గ్రంథాన్ని రా స్త మరొకరు దానికి ఖండనగా బుక్ రాశారని డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. ఈ విధానం ప్రజాస్వామ్య బద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం ప్రశ్నలు తట్టుకోలేని, సమాధానం చెప్పలేని వారు దాడులకు తెగబడుతున్నారని అన్నారు. దీన్ని అన్ని విధాలుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. దాడులకు, సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లకు పాల్ప డుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, సామాజిక వేత్త డా.జాడి రాజు, మౌజం హుస్సేన్, కస్తూరి ప్రభాకర్, ఉదయకుమారి, గణేష్, రామయ్య, బక్క శ్రీనివాసాచారి, రమణారెడ్డి, అరుణ, శ్రీనివాస్, భిక్షమయ్య, హరి, కొండల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

అంబ భవాని ఎత్తిపోతలను పూర్తిచేస్తాం




తిమ్మాపురంలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

నేరేడుగొమ్ము, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అంబ భవాని ఎత్తిపోతల నిర్మాణ పనులను పూర్తి చేసి మండలంలోని గ్రామాలకు సాగు నీరు అందిస్తామని నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపురం, నేరేడుగొమ్ము, పెద్దమునిగల్ గ్రా మాల్లో సీసీ రోడ్డు, మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ పథకాలను ప్రారంభించామని పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నాయిని జమునా మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోకసాని కృష్ణ, శ్రీధర్, పాప నాయక్, కొండ్ర శ్రీశైలం యాదవ్, యుగేందర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, కిన్నెర హరికృష్ణ, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ బాలు, అధికారులు పాల్గొన్నారు.

చేనేత సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హాలియా, (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘం క్యాలెండర్‌ను ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మలిగిరెడ్డి లింగారెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, వెంపటి శ్రీనివాస్, బాబోద్దీన్, అన్వర్, చల్లా మట్టారెడ్డి, నకిరేకంటి సైదులు, సోమశేఖర్, జూపల్లి శ్రీనివాస్, పాండునాయక్, రాజేందర్‌రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు పున్నా కైలాష్‌నేత, చేనేత సంఘం డైరెక్టర్ గడ్డం రమణయ్య, పాల్గొన్నారు.

చిన్నారులను ప్రీ స్కూల్‌కు సంసిద్ధం చేయాలి



ఆమనగల్లులో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ రజిని

వేములపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆటపాటల ద్వారా ప్రీ స్కూల్‌కు సంసిద్ధులను చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని అన్నారు. ఆమనగల్లు అంగన్‌వాడీ కేంద్రం-2లో గురువారం చిన్నారులకు నిర్వహి ంచిన సామూహిక అక్షరా భ్యాసం లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రైమరీ స్కూల్‌టీచర్ రాధా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● చింతపల్లి(ఆంధ్రజ్యోతి): చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులో పని చేస్తున్న జ్ఞానేశ్వరితో పాటు అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుగుణ, పార్వతి, టీచర్లు బాదేపల్లి స్వప్న, శారద, లీలావతి, సన్మానం పొందిన వారిలో వినోద, సుగుణమ్మ, విమలమ్మ, ప్రమిల, తదితరులు పాల్గొన్నారు.